బలగం TV
BALAGAM
నిజమే మా బలం..ప్రజలే మా బలగం
BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com
హైదరాబాద్ శుక్రవారం, 10 జూలై-2026 balagamtv100@gmail.com పేజీలు-8

## కాంగ్రెస్ పని ఇక అయిపోయినట్టేనని రేవంత్ సర్వేలోనే తేలింది



వివరాలు 2లో..

## మండలి చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సీఎస్ సంజయ్ జాజు



వివరాలు 2లో..

# కడియంకు కొండా సురేఖ సవాల్





హైదరాబాద్, జూలై 09 : కడియం శ్రీహరిపై చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డికి మంత్రి కొండా సురేఖ ఫిర్యాదు చేశారని తెలిసిందే. నా దేవాదాయ శాఖలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి జోక్యం సరికాదు. నాకు సమాచారం ఇవ్వకుండా అధికారులతో కడియం శ్రీహరి సమీక్ష జరిపారని మంత్రి కొండా సురేఖ సీఎం రేవంత్ రెడ్డికి రాసిన లేఖలో పేర్కొన్నారు.దీనిపై కడియం స్పందిస్తూ.. కొండా సురేఖది అవగాహన లోపమని... అధికారులు నా దగ్గరికి వస్తే సమీక్ష అంటారు.. నేను అధికారుల దగ్గరికి వెళ్తే సమీక్ష అనరని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడకూడదు అని చెప్పే మంత్రిని మొదటిసారి మిగతా 3లో..



# హైదరాబాద్‌ను కాలుష్యరహిత నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- సీఎం రేవంత్ రెడ్డి

బలగం టీవీ, హైదరాబాద్: హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు అంతర్భాగం మొత్తంగా కాలుష్య రహిత ప్రాంతంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించుకుని పనిచేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. 2,100 చ.కి.మీ మేరకు విస్తరించి ఉన్న ఓఆర్ఆర్ లోపల కోర్ అర్బన్ ఏరియాలో 1 కోటి 35 లక్షల జనాభా అవసరాలకు అనుగుణంగా నగరాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. సోలార్ మాడ్యూల్స్ తయారీ రంగంలో ప్రసిద్ధ ప్రిమియర్ ఎనర్జీస్ సంస్థ రంగారెడ్డి జిల్లా సీతారాంపూర్‌లో నెలకొల్పిన 5.6 గిగావాట్ల సామర్థ్యం కలిసిన సోలార్ మిగతా 3లో..



## కమీషన్లపైనే కాంగ్రెస్ సర్కార్ పాలన..



- రాబోయేది బీఆర్ఎస్ సర్కారే : హరీశ్‌రావు

హైదరాబాద్, జూలై 09 : కాళేశ్వరం నుండి వచ్చే గోదావరి జలాలు ప్రజల కండ్లకు కనబడుతున్నా.. సీఎం రేవంత్ రెడ్డి కండ్లకు మాత్రం కనబడడం లేదా..? అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రశ్నించారు. గురువారం జిల్లా కేంద్రంలోని పటేల్ గార్డెన్‌లో సిద్దిపేట లారీ ఓనర్స్ అండ్ డ్రైవర్ అసోసియేషన్ వారికి ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్య శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. మిగతా 3లో..

## ప్రజాస్వామ్యానికి జర్నలిజం నాలుగో స్తంభం



- జర్నలిస్టుల హెల్త్ కార్డుల సమస్యను త్వరలో పరిష్కరిస్తాం :
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మిగతా 2లో..

# రైతులు ఆరు తడిపంటలు వేయాలి:ఉత్తమ్



హైదరాబాద్, జూలై 09 : మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో వర్షాలు పడుతుండటంతో వరదలు వచ్చే అవకాశముందని, శ్రీపాద ఎల్లంపల్లికి ప్రవాహాలు ప్రారంభం కాగానే ఎత్తిపోతల పథకాల పంపింగ్‌ను ప్రారంభించాలని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలు, ఆరు తడి పంటలపై రైతాంగం దృష్టి సారించాలని సూచించారు. భారత వాతావరణ కేంద్రం సూచనలన్నీ పరిగణనలోకి తీసుకొని ముందుకెళ్లాలన్నారు. ఈ విషయంలో రైతాంగం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని గుర్తు చేశారు. వదంతులను నమ్మకుండా అధికార యంత్రాంగం, వ్యవసాయ శాస్త్ర వేత్తలు ఇచ్చే మార్గదర్శకాలనే పాటించాలని కోరారు. గురువారం సచివాలయంలో ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్లు, మిగతా 3లో..

## పసిపిల్లలపై పాశవికం.. చేతులు, కాళ్లు కట్టి వేడి గరిటెతో చిత్రహింసలు



మిగతా 3లో..

# పశ్చిమాసియా మళ్లీ ఉద్రిక్తం..



న్యూఢిల్లీ, జూలై 09 : పశ్చిమాసియాలో పరిస్థితి మళ్లీ ఉద్రిక్తంగా మారింది. అమెరికా , ఇరాన్ దేశాల మధ్య దాడులు, ప్రతిదాడులతో దద్ధరిల్లుతోంది. ప్రస్తుతం ఆస్ట్రేలియా లో ఉన్న ప్రధాని నరేంద్రమోదీ పశ్చిమాసియాలో తాజా పరిస్థితులపై స్పందించారు. మెల్‌బోర్న్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న అన్ని ఘర్షణలు దౌత్యం, చర్చలు ద్వారానే పరిష్కారమవుతాయని పేర్కొన్నారు.మూడు దేశాల పర్యటనలో భాగంగా ప్రస్తుతం ఆస్ట్రేలియాలో ఉన్న మోదీ.. ఆ దేశ ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్‌తో కలిసి ఇండియా–ఆస్ట్రేలియా సీఈఓ ఫోరమ్‌లో ప్రసంగించారు. వాణిజ్యం, రక్షణ, విద్య సహా పలు అంశాలపై ఆల్బనీస్‌తో చర్చించారు. అలాగే స్వచ్ఛ ఇంధనాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో మిగతా 3లో..

## మన్ననూరు ప్రభుత్వ దవాఖానలో దయనీయ పరిస్థితులు



మిగతా 2లో..

# వానాకాలం రైతు భరోసా నిధుల జమ పూర్తి

- రైతుల ఖాతాల్లో నేడు మరో 1,009 కోట్లు
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- వృత్తుల కన్నా వ్యవసాయం మిన్న: తుమ్మల
- నేడు ఖమ్మం జిల్లాకు సీఎం రేవంత్‌రెడ్డి



ఖమ్మం, జూలై 9: 'రాష్ట్ర ప్రభుత్వంపైన విమర్శలు చేస్తున్న పార్టీల వారు తిరిగి అధికారంలోకి వచ్చేది లేదు.. చేసేదీ లేదు. గతంలో పదేళ్లు పాలించిన వారివన్నీ మాటలే.. కానీ ప్రజా ప్రభుత్వానివన్నీ చేతలే. అందుకే 9 రోజుల్లో రూ.9 వేల కోట్లు రైతుల ఖాతాలో జమ చేసిన దేశంలో ఏకైక ప్రభు త్వంగా.. ప్రజాప్రభుత్వం నిలుస్తుంది' అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రైతు భరోసా విజయోత్సవాల్లో భాగంగా ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం చింతకాని మండలం జగన్నాథపురంలో శుక్రవారం రైతు ఆశీర్వాద సభ జరగనుంది.సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజ రుకానున్నారు. అదే ప్రాంగ ణంలో ఏర్పాటు చేసిన మెగా రైతు మేళాను గురువారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవ సాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. రైతు మేళా సభలో, చింతకాని మండలం లచ్చగూడెంలో భట్టి విక్రమార్క విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని కష్టాలు ఎదురైనా రైతుల సంక్షేమం విషయంలో ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తోందని, విత్తనం వేసినప్పటి నుంచి పంట కొనుగోలు వరకు రైతులకు అండగా నిలుస్తోందన్నారు. దశాబ్దాల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించిన నాగార్జున సాగర్, శ్రీరాంసాగర్, కడెం లాంటి ప్రాజెక్టులు నేటికీ రైతులకు సాగునీటిని అందిస్తున్నాయని.. గత ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం కుంగిపోడడం ఆ ప్రభుత్వ పాలనకు నిదర్శనమని విమ ర్శించారు. శుక్రవారం రైతు ఆశీర్వాద సభా వేదిక నుంచి రైతు భరోసాలో భాగంగా మిగి లిన రూ.1,009కోట్లను విడుదల చేస్తామని ప్రకటించారు.

# పోక్సో కేసులో కీలక పరిణామం




## బండి భగీరథ్‌కు బెయిల్ మంజూరు

హైదరాబాద్, జూలై 09 : రాష్ట్రంలో తీవ్ర సంచలనం సృష్టించిన పోక్సో (POCSO) కేసులో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథకు లీగల్ పరంగా పెద్ద ఉపశమనం లభించింది.భగీరథ్ దాఖలు చేసిన రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు గురువారం ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులో ఇరుపక్షాల సుదీర్ఘ వాదనలు విన్న అనంతరం హైకోర్టు తుది తీర్పును ప్రకటించారు. రూ.1 లక్ష చొప్పున రెండు వ్యక్తిగత పూచీకత్తులు సమర్పించాలని, కోర్టు విధించిన నిబంధనలకు కట్టుబడి ఉండాలని ఆదేశిస్తూ భగీరథ్‌కు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేశారు. అంతకుముందు పరీక్షలు రాసేందుకు లోయర్ కోర్టు వారం రోజుల పాటు తాత్కాలిక (ఇంటరిమ్) బెయిల్ ఇవ్వగా.. గడువు ముగిసిన తర్వాత ఆయన జూన్ 25న తిరిగి జైలులో లొంగిపోయారు. ఆ తర్వాత రెగ్యులర్ బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు.

## గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్..

26 మంది విద్యార్థులకు తీవ్ర అస్వస్థత 2లో..



# ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఎయిమ్స్



- విద్య, పరిశోధనలకు కూడా సమ ప్రాధాన్యం
- రోగుల సంఖ్య పెరిగినా సేవల్లో రాజీ పడబోం: నడ్డా

హైదరాబాద్, జూలై 09 : బీబీ నగర్ అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)ను ప్రపంచస్థాయి ప్రమాణాలతో దక్షిణాదిలోనే అత్యాధునిక, మెరుగైన వైద్య సేవలకు కేంద్రంగా అభివృద్ధి చేస్తామని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా అన్నారు. గురువారం ఆయన యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఎయిమ్స్‌ని సందర్శించారు. వివిధ వైద్య విభాగాలను పరిశీలించారు. పాలక మండలితో సమీక్షించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీబీనగర్ ఎయిమ్స్ నిర్మాణ పనులు 87 శాతం పూర్తయ్యాయని, ఈ ఏడాది చివరికల్లా పూర్తిస్థాయిలో వైద్య సేవలు ప్రారంభిస్తామని చెప్పారు. ఈ ఆస్పత్రికి రోగుల సంఖ్య ఎంత పెరిగినా వైద్యుల సంఖ్య పెంచడంలో, వైద్య సేవల్లో రాజీ పడబోమని స్పష్టం చేశారు. ఇక్కడ వైద్య సేవలు, ఆధునిక వైద్య విద్య, పరిశోధనలకు సమప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ప్రస్తుతం బీబీనగర్ ఎయిమ్స్‌లో రోజుకు 1,800 మంది అవుట్ పేషెంట్లకు సేవలు అందుతున్నాయని తెలిపారు. టెలీ మెడిసిన్, ఓపీడీ ద్వారా ఇప్పటి వరకు మిగతా 3లో..

# మధ్యంతర ఉత్తర్వులు సవరించండి

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై హైకోర్టును ఆశ్రయించిన ప్రభుత్వం

### తదుపరి విచారణ నేటికి వాయిదా



హైదరాబాద్, జూలై 09 : విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విషయమై ఇటీవల జారీచేసిన మధ్యంతర ఉత్తర్వులను సవరించాలని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న ఉత్తర్వుల వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులు ఫీజులు చెల్లించలేక ఇబ్బందులు ఎదురొనే పరిస్థితి ఏర్పడుతుందని పేరొన్నది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉండటాన్ని, ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం జారీచేసిన జీవోలను సవాలు చేస్తూ పలు ఇంజినీరింగ్ కాలేజీలు గతంలో పిటిషన్లు దాఖలు చేశాయి. ఈ కేసుల్లో హైకోర్టు వెలువరించిన మధ్య ంతర ఉత్తర్వులను తొలగించాలని ప్రభుత్వం తాజాగా పిటిషన్ వేసింది. దీనిపై జస్టిస్ జువ్వాడి శ్రీదేవి విచారణ చేపట్టారు. ప్రభుత్వ అభ్యర్థనను పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాదులు తీవ్రంగా వ్యతిరేకరించారు. గతంలో దాఖలైన ప్రధాన పిటిషన్లలో కౌంటర్లు దాఖలు చేయకుండా మధ్యంతర ఉత్తర్వులను సవరించాలంటూ ప్రభుత్వం కొత్త పిటిషన్ వేయడం సరికాదని పేర్కొన్నారు. ఆ ఉత్త ర్వులు అమలు చేసేలా ప్రభుత్వాన్ని మరోసారి ఆదేశించాలని కోరారు. విద్యార్థుల ఖాతాల్లో ఫీజు మొత్తాన్ని జమ చేస్తామని, అనంతరం ఆ సొమ్మును వారంలోగా కళాశాలలకు చెల్లించాలని ప్రభుత్వం చెప్తున్నదని పేర్కొంటూ.. ప్రభుత్వం జమచేసిన మొత్తాలను విద్యార్థులు చెల్లించకపోతే కళాశాలల పరిస్థితి ఏమిటనే సందేహాన్ని లేవనెత్తారు. ప్రభుత్వ న్యాయవాది శ్రీరఘురాం వాదనలు వినిపిస్తూ.. గతంలోని మధ్యంతర ఉత్తర్వులను అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని చెప్పారు. ప్రభుత్వం చెల్లించిన మొత్తాలను విద్యార్థుల నుంచి వసూలు చేయడాన్ని వ్యతిరేకించడం లేదని, విద్యార్థుల ఖాతాల్లో నిధులు జమచేసే వరకు మాత్రమే కళాశాలలు వేచి ఉండాలని తెలిపారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో తొలి విడత అడ్మిషన్లకు అవసరమైన నిధులు విడుదల చేస్తామని చెప్పారు. ఈ వాదనల అనంతరం హైకోర్టు తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది.

# కాంగ్రెస్ పని ఇక అయిపోయినట్టేనని రేవంత్ సర్వేలోనే తేలింది

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, జూలై 09 : తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పని ఇక అయిపోయినట్లే అని.. ఇదే అంశం రేవంత్ రెడ్డి చేయించుకున్న సొంత సర్వేలోనూ తేలిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తన పరిపాలనపైన, తన నాయకత్వంపైన, సగం పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో ముఖ్యమంత్రి ఒక విస్తృత సర్వేను చేయించుకున్నారని, అందులోనూ ప్రజా వ్యతిరేకత చాలా స్పష్టంగా వ్యక్తమైందన్నారు. గ్రేటర్ హైదరాబాద్ బీఆర్ఎస్ పార్టీ నేతలతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశమయ్యారు. మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ నివాసంలో జరిగిన ఈ సమావేశానికి గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ప్రధాన కార్యదర్శులు, నియోజకవర్గ ఇంచార్జ్‌లు, ఎస్ఐఆర్‌కమిటీ నేతలు హాజరయ్యారు. గ్రేటర్ హైదరాబాద్ నగరంలో ఎస్ఐఆర్ పై ప్రజల నుంచి వస్తున్న అభ్యంతరాలు, అలాగే పార్టీ పరంగా చేయాల్సిన సూచనలపై ఈ సందర్భంగా సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే భారత రాష్ట్ర సమితి సుమారు 78 సీట్లతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ఆ సర్వేలో తేలిందన్నారు. దీంతో పాటు రెండు మీడియా సంస్థలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఇంటెలిజెన్స్ విభాగాలు చేసిన ప్రజాభిప్రాయ సేకరణలోనూ ఇదే అంశం వ్యక్తమైందన్నారు. మరోసారి ప్రజలు కేసీఆర్ ను ముఖ్యమంత్రిగా చూడాలనుకుంటున్నామని స్పష్టంగా తమ అభిప్రాయం చెప్పిన విషయాన్ని కేటీఆర్ ప్రస్తావించారు. అయితే తన సొంత సర్వేతో పాటు పలు సర్వేల్లో వ్యక్తమైన ప్రజా వ్యతిరేకతను చూసి తట్టుకోలేకనే ముఖ్యమంత్రి గత వారం రోజులుగా అడ్డగోలుగా మాట్లాడుతున్నారన్నారు. దీంతోపాటు తన పరిపాలన వైఫల్యాలను ముఖ్యంగా కప్పిపుచ్చుకునేందుకు అనేక అటెన్షన్ డైవర్షన్ పనులు చేస్తున్నారని, అందులో భాగంగానే కాళేశ్వరం నుంచి మొదలుకొని రైతుబంధు వరకు అన్నింటిపైన అడ్డగోలుగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ పతనం దాదాపు ఖాయమైపోయిందని, సగం పరిపాలనా కాలం ముగిసిన తర్వాత ప్రజలు కాంగ్రెస్ పార్టీ పైన తీవ్రమైన ఆగ్రహంతో ఉన్నారన్నారు. ఇచ్చిన గ్యారంటీల అమలు, గ్యారంటీలు, డిక్లరేషన్లు, 420 హామీల అమలులో పూర్తిగా విఫలమైనందు వల్లనే తెలంగాణలోని సబ్బండ వర్గాలు కాంగ్రెస్ పార్టీ పరిపాలనపై నమ్మకం కోల్పోయారన్నారు. దీంతోపాటు కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయంగా స్పష్టంగా ప్రజలు బీఆర్ఎస్ కావాలని కోరుకుంటున్నారని, బీజేపీ లాంటి ఇతర పార్టీలకు ఏమాత్రం అవకాశం ఇవ్వడానికి సిద్ధంగా లేరన్నారు. కాంగ్రెస్ పార్టీ జారుడు బండపైన నిలబడిందని, ఇక పుంజుకునే అవకాశమే లేదన్నారు. ఎన్ని రకాల ప్రయత్నాలు చేసినా, ఎన్ని రకాల అబద్ధాలు చెప్పినా, ప్రజలను మోసం చేయాలని చూసినా కాంగ్రెస్ పార్టీ ముందు ముందు ప్రజామోదం పొందడం అత్యంత కష్టమన్నారు.

# మండలి చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సీఎస్ సంజయ్ జాజు

హైదరాబాద్, జూలై 09 : తెలంగాణ నూతన సీఎస్ సంజయ్ జాజు గురువారం తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ని, శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ను వారివారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలి చైర్మన్‌కు, అసెంబ్లీ స్పీకర్‌కు సీఎస్ పుష్పగుచ్ఛం అందజేసి ,శాలువాతో సత్కరించారు. అనంతరం వారు సీఎస్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సెక్రెటరీ డాక్టర్ నరసింహా చార్యులు , వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య తదితరులు పాల్గొన్నారు.



# ప్రేమ వివాహం చేసుకున్నాడని యువకుడి కుటుంబ సభ్యులపై దాడి :

హైదరాబాద్, జూలై 09 : ప్రేమ వివాహం చేసుకు న్నాడని యువకుడిపై యువతి కుటుంబ సభ్య దాడి చేసి ఎత్తుకెళ్లిన సంఘన స్థానికంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే..మెదక్ జిల్లా సలాబత్ పూర్ గ్రామానికి చెందిన యువతిని ఈ నెల 6వ తేదీన ఎల్లపూర్ గ్రామానికి చెందిన ప్రణయ్ అనే యువకుడు ప్రేమ వివాహం చేసుకున్నాడు. కులాంతర వివాహం చేసుకుందనే కోపంతో ప్రణయ్ కుటుంబ సభ్యులపై యువతి కుటుంబ సభ్యులు దాడికి పాల్పడ్డారు. యువతి ప్రణయ్‌తోనే ఉంటానని చెప్పడంతో ఇరు కుటుంబాలకు పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి పంపారు. కౌన్సిలింగ్ అనంతరం యువతి బంధువులు నాలుగు కార్లలో ప్రణయ్ ఇంటికి వెళ్లి అతని కుటుంబ సభ్యులపై దాడి చేసి యువతిని బలవంతంగా తీసుకెళ్లారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# రాజ్యసభ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్‌గా వద్దిరాజు నియామకం



హైదరాబాద్, జూలై 09 : రాజ్యసభలో బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఫ్లోర్ లీడర్‌గా నియమితులయ్యారు. రాజ్యసభ సభ్యుడుగా, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న కేఆర్ సురేష్ రెడ్డి పదవీకాలం ముగియడంతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా వద్దిరాజు రవిచంద్రను ఫ్లోర్ లీడర్‌గా నియామకం పట్ల తెలంగాణ మున్నూరు కాపు సంఘం నాయకులు పార్టీ అధినేత కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. వద్దిరాజు నియామకం బీసీల, తెలంగాణ హక్కుల సాధనలో కీలకంగా మారుతారని సంఘం అధ్యక్షుడు సర్దార్ పుటం పురుషోత్తం పటేల్ అన్నారు. వద్దిరాజు రవిచంద్ర సేవలను గుర్తించి కీలకమైన బాధలు అప్పగించిన కేసీఆర్‌కు మున్నూరు కాపు సమాజం కృతజ్ఞతలు తెలుపుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి రావలసిన రాజ్యాంగపరమైన హక్కుల సాధనలో వద్దిరాజు కృషి మరింత పెరగడానికి అవకాశం దక్కిందని పేర్కొన్నారు.

# ప్రజాస్వామ్యానికి జర్నలిజం నాలుగో స్తంభం




- జర్నలిస్టుల హెల్త్ కార్డుల సమస్యను త్వరలో పరిష్కరిస్తాం :
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా

సంగారెడ్డి, జూలై 9 : ప్రజాస్వామ్య వ్యవస్థకు జర్నలిజం నాలుగో స్తంభమని, వార్తల ప్రసారంలో వేగం ఎంత అవసరమో విశ్వసనీ యత అంతకంటే ముఖ్యమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సత్యం, నైతికత, సామాజిక బాధ్యతలను జర్నలిజం ఎల్లప్పుడూ పరిరక్షించాలని ఆయన సూచించారు. గురువారం సంగారెడ్డిలోని టీఎన్‌జీవో భవన్‌లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ (TUWJ--IJU) సంగారెడ్డి జిల్లా మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ, సంగారెడ్డి వేదికగా జర్నలిస్టుల మహాసభ నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. జర్నలిస్టులు ప్రజల గొంతుకగా, సమాజానికి దిశానిర్దేశం చేసే శక్తిగా బాధ్యతాయుత పాత్ర పోషిస్తున్నారని మంత్రి కొనియాడారు. వేగవంతమైన సమాచార ప్రసారంతో పాటు వార్తలలో వాస్తవికత, విశ్వసనీయత, నైతిక విలువలు పాటించడం జర్న లిజం యొక్క ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న హెల్త్ కార్డుల సమస్యను ప్రభుత్వం సమీక్షిస్తోందని, త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకొని సమస్యను పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు. మీడియా ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడంతో పాటు సమాజంలో చైతన్యం కల్పించే కీలక బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, జిల్లా అధ్యక్షులు బండారి యాదగిరి, ప్రధాన కార్యదర్శి విష్ణు ప్రసాద్, మాజీ అధ్యక్షుడు మల్లికార్జున రెడ్డి, వివిధ జిల్లాల అధ్యక్షులు, నాయకులు ఫైజల్, పానుగంటి కృష్ణ, అనిల్ కుమార్, ఆసిఫ్ , సిద్ధన్న పాటిల్, మునిపల్లి యాదగిరి, మున్సిపల్ చైర్పర్సన్ లు వనిత, అంజమ్మ, జిల్లా సీనియర్ జర్నలిస్టులు, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

# సూపర్ ఎల్‌నినో ప్రభావంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి:



- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

కొత్తగూడెం, జూలై 9: రాష్ట్రంలో వర్షపాతం లోటు, జలాశయాల్లో పరిమిత నీటి నిల్వల నేపథ్యంలో రైతులకు సూపర్ ఎల్‌నినో ప్రభావంపై విస్తృత అవగాహన కల్పించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఐటీ & పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ అంకిత్ IAS పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటివరకు సుమారు 15 శాతం వర్షపాతం లోటు నమోదైందని, జలాశయాల్లో నీటి నిల్వలు పరిమితంగా ఉన్నాయని తెలిపారు. సాగునీటి వసతి లేని ప్రాంతాల్లో వరి సాగు చేయకుండా, తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను రైతులు ఎంచుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. జూలై 15 తర్వాత జలాశయాల్లో నీటి నిల్వలను సమీక్షించి, పరిస్థితులకు అనుగుణంగా రైతులకు పంటలపై మార్గదర్శకాలు జారీ చేస్తామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ అంకిత్ IAS మాట్లాడుతూ జిల్లాలో గ్రామసభలు, రైతు వేదికల ద్వారా ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వర్షాలు ఆలస్యమైన నేపథ్యంలో రైతులు పత్తి, కందులు, పెసర వంటి తక్కువ నీటితో సాగయ్యే పంటల వైపు మొగ్గు చూపుతున్నారని వివరించారు. అలాగే వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు స్వల్పకాలిక పంటలు, తేమ సంరక్షణ చర్యలు, నాణ్యమైన విత్తనాల పంపిణీ, సాంకేతిక సూచనలతో జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని కలెక్టర్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ IAS సంబంధిత అధికారులతో ఖరీఫ్ సాగు, నీటి లభ్యత, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికపై సమీక్ష సమావేశం నిర్వహించి అవసరమైన సూచనలు చేశారు.

# మన్ననూరు ప్రభుత్వ దవాఖానలో దయనీయ పరిస్థితులు



హైదరాబాద్,జూలై09 :నాగర్‌కర్నూల్ జిల్లాలోని మన్ననూరు ప్రభుత్వ దవాఖానలో దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి. ఫుడ్ పాయిజన్ బారిన పడిన అమ్రాబాద్ మండలం మన్ననూరులోని ట్రైబల్ వెల్ఫేర్ బాలుర పాఠశాల విద్యార్థులను చికిత్స నిమిత్తం మన్న నూరు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. బెడ్స్ లేక విద్యార్థులను నేలపై పడుకోబెట్టి వైద్యులు చికిత్స చేయాల్సిన దుస్థితి నెలకొంది. చికిత్స అనంతరం విద్యార్థులను అచ్చంపేట హాస్పిటల్‌కు తరలించారు.

# జర్నలిస్టుల ప్రాణాలు కాపాడండి

## మంత్రి దామోదరను కోరిన TUWJ రథసారధి విరాహత్

### సానుకూలంగా స్పందించిన మంత్రి



హైదరాబాద్, జూలై 09 : తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఖఔజీ) సంగారెడ్డి జిల్లా మహాసభ గురువారం నాడు విజయవంతంగా జరిగింది. జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల నుండి దాదాపు 450మంది ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు హాజరయ్యారు. ఈ సభకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజానర్సింహా ముఖ్య అతిథిగా హాజరు కాగా, మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఆరోగ్య పథకం లేక పదేళ్ల వ్యవధిలో రాష్ట్రంలో దాదాపు 645మంది జర్నలిస్టులు అకాల మరణం చెందారని, ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేస్తున్న క్యాష్ లేస్ హెల్త్ స్కీమ్ ను జర్నలిస్టులకు కూడా అమలు చేసి ఆరోగ్య భద్రతా కల్పించాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ మంత్రిని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారు. త్వరలో యూనియన్ నాయకత్వంతో సమావేశమై, పథకం రూపకల్పన చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఇంకా ఈ కార్యక్రమంలో బిషయు ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ, ఉపాధ్యక్షులు ఫైసల్ అహ్మద్, కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యాదగిరి, విష్ణుప్రసాద్, మాజీ అధ్యక్షులు మల్లికార్జున్ రెడ్డి, యూనియన్ సీనియర్ నాయకులు పానుగంటి కృష్ణ, సిద్దిపేట జిల్లా కార్యదర్శి అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి అధికారుల ఆందోళనలు ఉధృతం..

## హెచ్‌ఎంఎస్ జాతీయ కమిటీ మద్దతు




గోదావరిఖని: సింగరేణి కాలరీస్‌లో అధికారుల డిమాండ్ల సాధన కోసం కొనసాగుతున్న ఆందోళనలు మరింత ఉధృతం కానున్నాయి. కోల్ ఇండియా సంస్థల్లో అమలవుతున్న పే అప్‌గ్రేడేషన్, లిలిపర్‌ఫార్మెన్స్ రిలేటెడ్ పే (గ్రా-ఛా)లిలితో పాటు ఇతర డిమాండ్లను సింగరేణి అధికారులకు కూడా అమలు చేయాలని కోరుతూ గత 20 రోజులుగా నిరాహార దీక్షలు, ర్యాలీలు కొనసాగుతున్నాయి. ఈ ఉద్యమాలకు హింద్ మజ్దూర్ సభ (ఎమీా) జాతీయ కేంద్ర కమిటీ పూర్తి మద్దతు ప్రకటించింది. ఆర్‌జీ-2 ఏరియాలోని 8 ఇంక్లైన్ కాలనీలో ఉన్న హెచ్‌ఎంఎస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో హెచ్‌ఎంఎస్ కేంద్ర కార్యదర్శి ఖాజీ మహమ్మద్ ఇస్మాయిల్ నిజామీ మాట్లాడుతూ, అధికారుల న్యాయమైన డిమాండ్లను యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. సీఎంఓఏఐ ఆధ్వర్యంలో ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా అధికారులు నిరాహార దీక్షలు, ర్యాలీలు నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంతో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా హైదరాబాద్ ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించేందుకు పోలీసు కమిషనర్‌కు అనుమతి కోసం దరఖాస్తు చేశారు.

# గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్..

## 26 మంది విద్యార్థులకు తీవ్ర అస్వస్థత



నాగర్‌కర్నూల్, జూలై 09 : :నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూరులోని ట్రైబల్ వెల్ఫేర్ బాలుర గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో 26 మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థత గురయ్యారు. ఉదయం అల్పాహారం తిన్న విద్యార్థులు అస్వస్థతకు గురవ్వడంతో గురుకుల సిబ్బంది విద్యార్థులను చికిత్స నిమిత్తం అచ్చంపేట దవాకాఖనకు తరలించారు. కాగా, గురుకులంలో సిబ్బంది తాగునీరు కూడా సరిగ్గా ఇవ్వడం లేదని విద్యార్థుల ఆవేదన వ్యక్తం చేశారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# శంషాబాద్‌లో బొలేరో వాహనం బీభత్సం..

## ఇద్దరు మహిళలు మృతి

హైదరాబాద్, జూలై 09 : శంషాబాద్‌లో బొలేరో వాహనం బీభత్సం సృష్టించింది. బస్సు కోసం వేచి ఉన్న ఇద్దరు మహిళలపై దూసుకెళ్లడంతో అక్కడిక్కడే దుర్మరణం చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. మృతులు సువర్ణ, సుమగా గుర్తించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# (మొదటిపేజీ తరువాయి)

## కమీషన్లపైనే కాంగ్రెస్ సర్కార్ పాలన..

నిత్యం కాలువలు, కెనాల ద్వారా సాగు తాగు నీరు ప్రజలకు అందుతుంటే రేవంత్ రెడ్డి మాత్రం కాళేశ్వరం కూలిపోయిందని తప్పుడు ప్రచారాలు చేస్తున్నాడని మండిపడ్డారు. రాజకీయంగా బీఆర్ఎస్‌పై బురద చల్లడమే లక్ష్యంగా కాంగ్రెస్ పని చేస్తుందన్నారు. అసత్య ఆరోపణలు చేస్తున్న రేవంత్ రెడ్డిని పిచ్చి ఆసుపత్రిలో చేర్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కాళేశ్వరం జలాలు సిద్దిపేటకు రావడంతోనే పెద్ద ఎత్తున పంట పండిందని, ధాన్యం నిల్వ ఉంచడానికి గోదాములు నిండిపోయి ధాన్యం తరలించడానికి కనీసం లారీలు కూడా దొరకని పరిస్థితి నెలకొందన్నారు. కాంగ్రెస్ పాలన కమిషన్లతోనే కొనసాగుతుందన్నారు. గురుకులాల్లో కోడిగుడ్లతో మొదలుకుంటే విద్యార్థులు వేసుకునే బూట్లు, యూనిఫామ్ ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతి దానిలో కమిషన్‌లో పడుతున్నారని మండిపడ్డారు.రవాణా శాఖ కార్యాలయంలో వాహనాలకు సంబంధించి రేడియం స్టిక్కలను సైతం అతికించడానికి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. గతంలో ఒక్క వాహనానికి రేడియం స్టిక్కర్ చేస్తే వెయ్యిలోపే అయ్యేదని ప్రస్తుతం కాంగ్రెస్ సర్కార్ తీసుకువచ్చిన రేడియం స్టిక్కర్ల నిర్ణయంతో కనీసం 6 వేల నుంచి 7 వేల వరకు ఖర్చు అవుతుందన్నారు. దీంతో వాహనదారులకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. రానున్నది బీఆర్ఎస్ సర్కారేనన్నారు. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉన్నప్పుడే అసలైన అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.లారీ అసోసియేషన్ ప్రతినిధులతోపాటు డ్రైవర్స్, సిబ్బంది తప్పకుండా ఎల్వి ప్రసాద్ కంటి ఆసుపత్రి సహకారంతో ఏర్పాటు చేస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తన సొంత డబ్బులతో కండ్ల అద్దాలు ఇప్పించడంతోపాటు అవసరమైతే కంటి ఆపరేషన్లు సైతం చేయిస్తానన్నారు. అలాగే వ్యక్తిగత ఇన్సూరెన్స్ చేపిస్తానన్నారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుంది కాబట్టి ప్రతి ఒక్కరూ నిత్యం వాకింగ్‌తోపాటు యోగా లాంటివి తప్పకుండా చేయాలన్నారు. సిద్దిపేట లారీ అసోసియేషన్ వారికి లారీల పార్కింగ్ కోసం స్థలాన్ని కేటాయించే విధంగా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## హైదరాబాద్‌ను కాలుష్యరహిత నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

మాడ్యూల్ తయారీ యూనిట్‌ను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తో కలిసి ముఖ్యమంత్రి ప్రారంభించారు. ప్రీమియర్ ఎనర్జీ రూపొందించిన మొట్టమొదటి సోలార్ ఆక్సీ ట్రీ–సోలార్ పవర్డ్ స్ట్రీట్ లైట్, ఎయిర్ క్లీనింగ్ సిస్టమ్ 'ఆక్సీట్రీ'ని, యూనిట్‌లో సోలార్ మాడ్యూల్స్‌కు సంబంధించి వివిధ ఉత్పత్తులను ముఖ్యమంత్రి పరిశీలించారు.ఈ యూనిట్ ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. దేశంలోని ఢిల్లీ, ముంబై, బెంగళూరు చెన్నై లాంటి మెట్రోపాలిటన్ నగరాలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. సరైన సమయం లో సరైన నిర్ణయాలు తీసుకోని కారణంగానే చాలా కష్టమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని చెప్పారు.ఆ నగరాల అనుభవాల నుంచి మనం పాఠాలు నేర్చుకోవాలి. హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియాలోని జీడిమెట్ల, బాలానగర్ లాంటి ఇండస్ట్రియల్ పార్కులున్న ప్రాంతాల్లో పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యం, దానికితోడు మూసీ నది కాలుష్యంతో నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అందుకే 2,100 చ.కి.మీ మేరకు విస్తరించి ఉన్న ఈ కోర్ అర్బన్ రీజియన్ లో పూర్తిగా కాలుష్యరహిత ప్రాంతంగా మార్చాలని సంకల్పించాం. పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తరలించడానికి చట్టం చేశాం. ఓఆర్ఆర్ బయట పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ ప్రాంతంలో మాన్యుఫాక్చరింగ్ జోన్ గా గుర్తించాం. ఇక్కడి నుంచి తరలించిన పరిశ్రమలకు అవసరమైన స్థలాలను మాన్యుఫాక్చరింగ్ జోన్ లో కేటాయిస్తాం అని ముఖ్యమంత్రి వివరించారు. మాన్యుఫాక్చరింగ్ జోన్‌లో మొట్టమొదటగా ప్రారంభమైన సంస్థ ప్రీమియర్ ఎనర్జీ కావడం ప్రశంసనీయం. కేవలం 12 నెలల కాలంలో యూనిట్‌ను నెలకొల్పిందని ముఖ్యమంత్రి సంస్థ యాజమాన్యాన్ని అభినందించారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌తో రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ అనే మూడు ప్రాంతీయ మండళ్లుగా విభజించి సమగ్రమైన ప్రణాళికలతో ముం దుకు వెళుతున్నాం. 2034 నాటికి 1 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్ది, తెలంగాణను దేశంలో అగ్రస్థానంలో నిలబెట్టాల న్నది మా సంకల్పం. వైట్ కాలర్ ఉద్యోగాలు కష్టమైన పరిస్థితులను అర్థం చేసుకుని యువత బ్లూకాలర్ జాబ్స్ అందిపు చ్చుకునే దిశగా నైపుణ్యతను పెంచడానికి ఎక్కువ దృష్టి సారించాం. ఏటీసీలు, పాలిటెక్నిక్ కాలేజీలు, స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు వంటి మొత్తంగా వ్యవస్థలను ఆ దిశగా సిద్ధం చేస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ ప్రపంచంతో పోటీ పడాలంటే ఇప్పుడున్న పెట్టుబడులు, పరిశ్రమలు సరిపోవు. మరిన్ని పెట్టుబడులు, పరిశ్రమలు రావాలి. 2047 నాటికి వంద సంవత్సరాల స్వాతంత్ర్య ఉత్సవాలను జరుపుకోబోతున్న తరుణంలో వెనక్కి తిరిగి చూస్తే ఎక్కడ మొదలయ్యాం. ఎక్కడికి చేరుకోవాలనుకున్నామో ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళ్లాలి.పెరిగిన కాలుష్యాన్ని నియంత్రించడానికి సోలార్ ఎనర్జీతో ఆక్సిజన్ పంపింగ్ చేసే యంత్రాలను ప్రీమియర్ ఎనర్జీ రూపొందించడం అభినందనీయం. అలాంటి పరిస్థితులు తలెత్తడంపై అందరూ ఆలోచన చేయాలి. ప్రకృతిని విధ్వంసం చేయడం వల్ల ఇలాంటి తీవ్రమైన పరిణామాలకు దారితీస్తోంది. నియంత్రించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. అంతకన్నా ఎక్కువ ప్రజల నుంచి సంపూర్ణ సహకారం ఉండాలని ముఖ్యమంత్రి కోరారు.ఈ కార్యక్రమంలో శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, కాలే యాదయ్య, ప్రీమియర్ ఎనర్జీ చైర్మన్ సురేందర్ పాల్ సింగ్ సలూజా, మేనేజింగ్ డైరెక్టర్ చిరంజీవ్ సింగ్ సలూజా, డైరెక్టర్ సుధీర్ మూల, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రేవతి రోహిణి, ప్రభుత్వ అధికారులు, సంస్థ ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

## కడియంకు కొండా సురేఖ సవాల్

చూస్తున్నానన్నారు కడియం శ్రీహరి. కొంతమంది అభివృద్ధి గురించి పట్టించుకోకుండా వివాదాలతో వార్తల్లో ఉండాలని చూస్తున్నారని కడియం శ్రీహరి మండిపడ్డారు.కాగా మంత్రి కొండా సురేఖ మరోసారి కడియంపై విరుచుకపడ్డారు. మంత్రి కొండా సురేఖ మీడియాతో మాట్లాడుతూ.. కడియం శ్రీహరి దమ్ముంటే మంత్రి పదవి తెచ్చుకోవాలి.. లేకపోతే రాజకీయాలకు రాజీనామా చేసి ఇంట్లో పడుకోవాలని మంత్రి కొండా సురేఖ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. కడియం శ్రీహరి ఎమ్మెల్యే పదవిలో ఇమడలేకపోతే రాజకీయాలకు రాజీనామా చేయాలన్నారు.కడియం శ్రీహరి వచ్చాకే కాంగ్రెస్ పార్టీలో వివాదాలు మొదలయ్యాయని..40 ఏళ్లు రాజకీయాల్లో ఉన్నాడు కాబట్టి కడియం సాధారణ ఎమ్మెల్యే పదవిలో ఉండలేకపోతున్నాడని మంత్రి కొండా సురేఖ అన్నారు. ఎమ్మెల్యే పదవిలో ఇమడలేకపోతే దమ్ముంటే మంత్రి పదవి తెచ్చుకోవాలి లేకపోతే రాజకీయాలకు రాజీనామా చేసి ఇంట్లో పడుకోండని కడియంకు హితవు పలికారు.కడియం శ్రీహరికి అంత నిజాయితీ ఉంటే రాజీనామా చేసి మళ్లీ కాంగ్రెస్ పార్టీ తరపున గెలిచి చూపించాలని సవాల్ విసిరారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను కలిశాను. 14వ తేదీన మీనాక్షి నటరాజన్‌ను కూడా కలిసి ఫిర్యాదు చేస్తానని చెప్పారు.

## పశ్చిమాసియా మళ్లీ ఉద్రిక్తం..

కీలకమైన అణుశక్తి ఒప్పందంపై సంతకాలు చేశారు. భారత్‌కు ఆస్ట్రేలియా యురేనియం సరఫరా చేస్తుందని మోదీ వెల్లడించారు. క్రిటికల్ మినరల్ కారిడార్, డిఫెన్స్ ఇన్నోవేషన్ కారిడార్ ఏర్పాటుకు ప్రణాళికలను ప్రకటించారు.ఇండో–పసిఫిక్‌లో శాంతి, సుస్థిరత, స్వేచ్ఛా నౌకాయానంపై కలిసి అడుగులు వేస్తామని ప్రధాని తెలిపారు. తాజా పర్యటన ఇరుదేశాల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. భారత్, ఆస్ట్రేలియా ప్రజలకు ఎంతో ఇష్టమైన ఆట క్రికెట్. అందుకే ఈ రెండు దేశాల మధ్య చర్చలు జరిగినప్పుడల్లా క్రికెట్ ప్రస్తావన వస్తూనే ఉంటుంది. తాజాగా కుదిరిన యురేనియం డీల్ నేపథ్యంలో ఆ భాషలోనే మన ప్రధాని మాట్లాడారు.'ప్రపంచ క్రీడా రాజధాని అయిన మెల్‌బోర్న్‌లో మనం ఈ రోజు ఉన్నాం. ఇక్కడ ఆ క్రీడల గురించి మాట్లాడకపోవడం అంటే టాస్ వేసిన తర్వాత కూడా క్రికెట్ మ్యాచ్ ప్రారంభం కాకపోవడమే అవుతుంది. ఈ రెండు దేశాల సంబంధాలకు ఇదొక ప్రత్యేక దౌత్యపరమైన భాష. మన సమావేశాలు క్రికెట్ మ్యాచ్‌లలానే ఉంటాయి. అజెండా వన్డే మ్యాచ్‌లా, నిర్ణయాలు టీ20 అంత వేగంగా, భాగస్వామ్యం టెస్ట్ మ్యాచ్ అంత సుదీర్ఘంగా, గాఢంగా ఉంటుంది' అని మోదీ వర్ణించారు. ఆస్ట్రేలియాతో యురేనియం డీల్ కుదిరిన నేపథ్యంలో ఆయన ఈ విధంగా మాట్లాడారు.

## ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఎయిమ్స్

1,56,000 మంది రోగులు వైద్య సేవలు పొందారన్నారు. 132 మంది ఫ్యాకల్టీ సభ్యులు, 133 మంది సీనియర్ వైద్యులు పనిచేస్తున్నారని చెప్పారు. వైద్య పరిశోధనల కోసం రూ.64 కోట్ల గ్రాంట్లు మంజూరయ్యాయని, 129 రీసెర్చ్ ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఫ్యాకల్టీ సభ్యులు 156 పరిశోధన పత్రాలు సమర్పించారన్నారు. 2014 కంటే ముందు దేశంలో ఎయిమ్స్‌లు ఏడు మాత్రమే ఉండేవని, నరేంద్ర మోదీ అధికారం చేపట్టిన తర్వాత 23కు పెరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, ఎయిమ్స్ డైరెక్టర్ అమిత అగర్వాల్ పాల్గొన్నారు.

## రైతులు ఆరు తడిపంటలు వేయాలి:ఉత్తమ్



అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా.. వర్చువల్‌గా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. ప్రతి జిల్లాలో వర్షపాతం, భూగర్భ జలాలు, రిజర్వాయర్ నీటి నిల్వలను నిరంతరం పర్యవేక్షిస్తూ వాటికి అనుగుణంగా పంటల ప్రణాళికను రూపొందిం చాలని ఉతమ్ ఆదేశించారు. ఎక్కువ నీరు అవసర మయ్యే సంప్రదాయ పంటలకు బదులుగా తక్కువ నీటితో పండే ఆరు తడి పంటలు సాగు చేసేలా రైతాంగాన్ని ప్రోత్సహించాలన్నారు. దీనికోసం గ్రామ సభలు, రైతు వేదికలు, క్షేత్రస్థాయి అవగాహన కార్యక్రమాలు చేపట్టి రైతులకు విస్తృతంగా వివరించాలని సూచించారు.

## పసిపిల్లలపై పాశవికం.. చేతులు, కాళ్లు కట్టి వేడి గరిటెతో చిత్రహింసలు



**సూర్యాపేట జిల్లా, హుజూర్‌నగర్:** మానవత్వాన్ని మంట గలిపే ఘటన హుజూర్‌నగర్‌లో వెలుగుచూసింది. ఇద్దరు అమాయక చిన్నారులను వారి తల్లి, సవతి తండ్రి తీవ్రంగా హింసించిన ఘటన స్థానికంగా కలకలం రేపింది.ఖమ్మం జిల్లాకు చెందిన ఇందూ అనే మహిళకు వెంకటేష్‌తో వివాహం కాగా, వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అనంతరం అనారోగ్యంతో వెంకటేష్ మృతి చెందడంతో, ఇందూకు హుజూర్‌నగర్‌కు చెందిన నకరికంటి రవితో పరిచయం ఏర్పడి రెండో వివాహం జరిగింది. అప్పటి నుంచి మొదటి భర్తకు జన్మించిన ఇద్దరు చిన్నారులతో కలిసి వారు హుజూర్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు.స్థానికుల కథనం ప్రకారం, సవతి తండ్రి రవికి ఆ చిన్నారులంటే ఇష్టం లేక తరచూ వారిపై కోపం చూపించేవాడు. అతని ప్రవర్తనకు ప్రభావితమైన తల్లి కూడా సొంత పిల్లలనే వేధించేదని ఆరోపిస్తున్నారు. చిన్నారుల చేతులు, కాళ్లు కట్టి వేడి ఇనుప గరిటెతో శరీరంపై కాల్చడం వంటి అమానుష హింసలకు పాల్పడినట్లు వెల్లడైంది.చిన్నారుల ఏడుపులు, ఆర్తనాదాలు తరచూ వినిపించడంతో అనుమానం వచ్చిన స్థానికులు ఇంట్లోకి వెళ్లి చూడగా, పిల్లలు తీవ్ర గాయాలతో కనిపించారు. వెంటనే వారిని రక్షించి హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు.పోలీసులు తల్లిదండ్రులను విచారించి ఘటనకు సంబంధించిన వివరాలు సేకరించారు. ప్రస్తుతం చిన్నారులను స్థానికుల పర్యవేక్షణలో ఉంచినట్లు తెలిపారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని, ఇకపై పిల్లలపై హింస కొనసాగితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే చిన్నారుల భవిష్యత్తు దృష్ట్యా వారిని బాలల సంరక్షణ వ్యవస్థ ఆధ్వర్యంలో ఉంచే చర్యలు కూడా తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు.

## పారదర్శకంగా భూముల సర్వే నిర్వహించాలి

- మొదటి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ సర్వే..
- రెవెన్యూ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేష్ కుమార్



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:** భూముల రీ సర్వేను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అత్యంత పారదర్శకంగా నిర్వహించి ప్రతి భూమికి స్పష్టమైన యాజ మాన్య హక్కులు కల్పించాలని రెవెన్యూ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేష్ కుమార్ ఆదేశించారు.భూముల రీ సర్వే, నక్ష సర్వే, రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు స్థలాల కేటాయింపుపై రెవెన్యూ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేష్ కుమార్ గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా, జిల్లా సమీకృత కార్యాలయాల సము దాయంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేష్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం భూముల రీ సర్వేను దశలవారీగా చేపడుతోందని తెలిపారు. తొలి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సర్వేతో ప్రతి సర్వే నంబర్‌కు స్పష్టమైన యాజమాన్య హక్కులు నిర్ధారించడంతోపాటు ప్రతి భూమికి ప్రత్యేక భూధార్ యూనిక్ నంబర్ కేటాయించనున్నట్లు తెలిపారు. డీజీపీఎస్ (DGPS), రోవర్స్, జీఐఎస్ (GIS) వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రీ సర్వే చేపట్టాలని ఆదేశించారు. రీ సర్వే జరుగుతున్న ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని, ఆయా గ్రామసభల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, మంత్రులను భాగస్వాములను చేయాలని సూచించారు.రీ సర్వేలో రెగ్యులర్ సర్వేయర్లతో పాటు లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. సోమవారం నుంచి సర్వేయర్లు, జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బందికి బ్యాచ్‌ల వారీగా సమగ్ర శిక్షణ నిర్వహించి అనంతరం అన్ని గ్రామాల్లో రీ సర్వే కార్యక్రమాలు ప్రారంభించాలని ఆదేశించారు. జిల్లాస్థాయిలో కూడా ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.రీసర్వే పూర్తయ్యే వరకు రెగ్యులర్ సర్వేయర్లలో 25 శాతం మందిని రొటేషన్ పద్ధతిలో విధుల్లో వినియోగించాలని తెలిపారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ల పనితీరును శాఖ సర్వేయర్లు నిరంతరం పర్యవేక్షించాలని, డిప్యూటీ తహసీల్దార్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో రీ సర్వే పనులను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని ఆదేశించారు.ప్రతి గ్రామంలో రీ సర్వే నాణ్యతతో నిర్వహించాలని, సర్వేలో ఉపయోగించే ఆధునిక పరికరాల వినియోగాన్ని సాంకేతికంగా పర్యవేక్షించే వ్యవస్థ అందుబాటులో ఉందని, వాటిని సమర్థవంతంగా ఉపయోగించాలని సూచించారు. రీ సర్వేలో పాల్గొనే లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ప్రభుత్వం గౌరవ వేతనం అందజేస్తుందని తెలిపారు.భూ భారతి దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం చేయవద్దని సూచించారు. త్వరగా పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవో, వీర్నపల్లి, తంగళ్లపల్లి, వేములవాడ, రుద్రంగిలో నూతన రెవెన్యూ కార్యాలయాలు, వేములవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నిర్మాణానికి స్థలాలు గుర్తించాలని ఆదేశించారు. వేములవాడ లో నక్ష సర్వే నిబంధనల ప్రకారంగడువులోగా పూర్తి చేయాలని సూచించారు. భూముల రీసర్వే కోసం కావలసిన సిబ్బంది అందు బాటులో ఉండేలా చూసుకొని.. పని పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులు ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో సిరిసిల్ల ఆర్డీఓ శ్రీధర్ బాబు, వేములవాడ మున్సిపల్ కమిషనర్ లోకేష్, సర్వే ఏడీ శ్రీనివాస్, సబ్ రిజిస్ట్రార్లు, రెవెన్యూ అధికారులు సిబ్బంది ఉన్నారు.

## జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి..

### వైద్యాధికారులు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లకు డీఎంహెచ్‌వో డా. ఏంజెలా ఆల్ఫ్రెడ్ శిక్షణ



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:** జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వ వైద్యాధికారులు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లకు జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో నిర్వహించినట్లు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. ఏంజెలా ఆల్ఫ్రెడ్ తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. శిక్షణలో పొందిన మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేసి, లక్ష్యానికి అనుగుణంగా ప్రతి అర్హులైన బాలబాలికకు అల్బెండాజోల్ మాత్రలు అందేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లను ఆదేశించారు.జిల్లాలో 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల ప్రతి బాలబాలికకు అల్బెండాజోల్ మాత్రలు అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమం రోజున మాత్రలు తీసుకోలేకపోయిన పిల్లలకు జూలై 20, 2026న మాప్-అప్ డే నిర్వహించి తప్పనిసరిగా మాత్రలు అందించాలని సూచించారు.వయస్సు వారీగా అల్బెండాజోల్ మాత్రల మోతాదును వివరిస్తూ, 1--2 సంవత్సరాల పిల్లలకు అర మాత్రను పొడి చేసి నీటితో, 2--3 సంవత్సరాల పిల్లలకు ఒక మాత్రను పొడి చేసి నీటితో, 3--19 సంవత్సరాల పిల్లలకు ఒక మాత్రను బాగా నమిలించి అనంతరం నీటితో మింగేలా చూడాలని తెలిపారు.తల్లిదండ్రులకు కార్యక్రమంపై ముందస్తు సమాచారం అందించి, పిల్లలను తప్పనిసరిగా కార్యక్రమంలో పాల్గొనేలా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి పాఠశాలలో ఒక నోడల్ టీచర్‌ను నియమించి, ప్రతి తరగతి క్లాస్ టీచర్ తన విద్యార్థులకు మాత్రలు వేయించే బాధ్యతను తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలకు ముందస్తు శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు.అల్బెండాజోల్ మాత్రలను ఎట్టి పరిస్థితుల్లోనూ పిల్లలకు ఇంటికి పంపించరాదని, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు లేదా నిర్దేశిత కేంద్రాల్లోనే పర్యవేక్షణలో వేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమం విజయవంతం కావడానికి స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, మతపెద్దలు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమానికి సంబంధించిన నివేదికలను సకాలంలో, ఖచ్చితంగా సమర్పించాలని వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బందికి ఆదేశించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డా. రామకృష్ణ, డా. నాగేంద్ర బాబు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు (ఎంఎల్‌హెచ్‌పీలు) తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా విద్యార్థులు జాగ్రత్తలు వహించాలి..

- అల్మాస్ పూర్ కేజీబీవీ లో ఉచిత ఆరోగ్య శిబిరం..
- 166 మందికి వైద్య పరీక్షలు నిర్వహించిన ఆరోగ్య సిబ్బంది..



**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని అల్మాస్ పూర్ కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం కేజీబీవీలో గురువారం ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 166 మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి సీజనల్ వ్యాధుల నివారణకు మందులు పంపిణీ చేసినట్లు సర్పంచ్ వెంకట్ రెడ్డి, ANM సుమలత, ఆరోగ్య సిబ్బంది తెలియజేశారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులందరూ పరిశుభ్రత పాటించి సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏదైనా ఆరోగ్య సమస్య ఉంటే వెంటనే ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపల్ అజంత, ఆశ వర్కర్లు మనీషా తదితరులు పాల్గొన్నారు.

## గంజాయిని కట్టడి చేయండి : బీఎస్పీ



**హైదరాబాద్, జూలై 09 :** తెలంగాణ రాష్ట్రంలో పల్లెలకు కూడా విస్తరిస్తున్న గంజాయి, డ్రగ్స్, మాదకద్రవ్యాలు కట్టడి చేయాలని బీఎస్పీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం రాష్ట్ర డీజీపీకి లేఖ రాశారు. చిన్నాపెద్ద అనే తేడా లేకుండా అన్ని వర్గాలను ప్రభావితం చేస్తూ సమాజాన్ని మత్తుపదార్థాలు కలుషితం చేస్తున్నాయని వెల్లడించారు. డ్రగ్స్ కల్చర్‌ను తక్షణమే నివారించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడాలని సూచించారు. మత్తు పదార్థాలను సరఫరా చేసేవారిపై ఉక్కుపాదం మోపాలని కోరారు.

## బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డికి ఊరట

### 2018 నాటి ఎన్నికల కేసును కొట్టివేసిన నాంపల్లి కోర్టు




**హైదరాబాద్, జూలై 09 :** బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్సీ ఎంశ్రీ నివాస్‌రెడ్డికి న్యాయస్థానంలో ఊరట లభించింది. 2018 శాసనసభ ఎన్నికల సమయంలో ఆయనపై నమోదైన ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసును నాంపల్లి కో ర్టు కొట్టివేసింది. ఈ విషయాన్ని బీఆర్ఎస్ లీగల్ సెల్ సభ్యుడు జకుల లక్ష్మణ్ గురువారం మీడియాకు వెల్లడించారు. 2018 ఎన్నికల సందర్భంగా మలక్‌పే ట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మెట్రో పిల్లర్లపై పార్టీ గుర్తు (కారు సింబల్) ఉన్న పో స్టర్లు వేశారంటూ ఫ్లయింగ్ స్క్వాడ్ ఫిర్యాదు చేసింది.ఈ నివేదిక ఆ ధారంగా మలక్‌పేట్ పోలీసులు అప్పు డు పార్టీ ప్ర ధాన కార్యదర్శిగా ఉన్న శ్రీనివాస్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు. ఈ కేసును సవా ల్ చేస్తూ బీఆర్ఎస్ లీగల్ టీమ్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. లీగల్ టీమ్ వాదనలతో ఏకీభవించిన హైకోర్టు కేసును క్వాష్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఆ క్వాష్ ఉత్తర్వులను నాం పల్లి కోర్టులో సమర్పించడంతో, ఈ కేసును పూర్తిగా కొట్టేస్తున్నట్టు ప్రకటించింది.

## సంపాదకీయం

# విరుచుకుపడ్డ ఇరాన్. యూఎస్ ఎయిర్ బేస్‌పై మిస్సైళ్లతో అటాక్..

టెహ్రాన్‌పై అమెరికా జరిపిన దాడులకు ఇరాన్ అత్యంత శక్తిమంతమైన బాలిస్టిక్ క్షిపణులతో సమాధానమిచ్చింది. ఇరాన్ సైన్యానికి చెందిన పవర్ ఫుల్ విభాగం 'ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్' (IRGC) గురువారం మధ్యాహ్నం రంగంలోకి దిగి పశ్చిమ ఆసియాలోని అమెరికా వ్యూహాత్మక స్థావరాలపై విరుచుకుపడింది. ఉత్తర జోర్డాన్‌లోని అమెరికాకు చెందిన 'అల్-అజ్రాక్' ఎయిర్ బెస్ పై ఇరాన్ సైన్యం ఏకంగా 10 బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించి ముట్టడించింది. వెస్ట్ ఆసియాలోని అమెరికా కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను తాము పూర్తిగా ధ్వంసం చేశామని ఐఆర్‌జీసీ అధికారిక ప్రకటనలో పేర్కొంది. ఇరాన్ సరిహద్దుల నుంచి దూసుకొచ్చిన క్షిపణులతో జోర్డాన్ గగనతలంలో ఒక్కసారిగా సైరన్లు మోగడం తీవ్ర కలకలం రేపింది. అమెరికా దూకుడుకు బుద్ధి చెప్పేందుకే తాము రెండు విడతలుగా ఈ ప్రతీకార దాడులు (ాబఅఓఅజవ =వంజూశీఅంవ) చేపట్టినట్లు ఇరాన్ ప్రభుత్వ అధికారిక మీడియా వెల్లడించింది. మొదటి దశలో భాగంగా కువైట్, బహ్రెయిన్‌లలో ఉన్న నాలుగు కీలకమైన అమెరికా సైనిక స్థావరాలను ఇరాన్ లక్ష్యంగా చేసుకుంది. కువైట్‌లోని ఆరిఫ్‌జాన్, అలీ అల్ సలేమ్ స్థావరాలతో పాటు బహ్రెయిన్‌లోని జుఫైర్, షేక్ ఈసా మిలిటరీ కేంద్రాలపై క్షిపణులు, ఆత్మాహుతి డ్రోన్లతో విరుచుకుపడి అక్కడి మౌలిక వసతులను దెబ్బతీసింది. అమెరికా గనుక మళ్లీ ఇరాన్ జోలికి వస్తే, ప్రాంతీయంగా ఉన్న మరిన్ని యూఎస్ సైనిక స్థావరాలను బూడిద చేస్తామని, వాటికి రక్షణ లేకుండా చేస్తామని ఐఆర్‌జీసీ హెచ్చరించింది. మరోవైపు, ఇరాన్‌కు చెందిన ఏకైక క్రియాశీల అణు విద్యుత్ కేంద్రమైన 'బుషెహర్' పరిసరాలపై అమెరికా వైమానిక దాడులకు తెగబడిందని ఇరాన్ ఆరోపించింది. రష్యన్ సాంకేతిక నిపుణుల పర్యవేక్షణలో నడుస్తున్న ఈ అణు ప్లాంటు పరిసరాల్లో భారీ పేలుళ్లు సంభవించాయని, ఇరాన్ దక్షిణ నగరమైన చాబహార్‌లో దాడుల కారణంగా విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయిందని అంతర్జాతీయ మీడియా పేర్కొంది. ఇటీవల జరిగిన దాడుల్లో క్షిపణి శకలాలు తగిలి అణు ప్లాంట్ సిబ్బంది ఒకరు మరణించగా, సమీప భవనాలు దెబ్బతిన్నాయి. అణు కేంద్రం సమీపంలో



దాడులు జరగడం ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆందోళన రేకెత్తించినప్పటికీ, ప్రస్తుతం ప్లాంట్ నుంచి ఎలాంటి రేడియేషన్ లీకేజీ కాలేదని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (IAEA) స్పష్టం చేసింది. ఇరాన్‌పై తాము జరుపుతున్న దాడులను అమెరికా సెంట్రల్ కమాండ్ (CENTCOM) సమర్థించుకుంది. వ్యూహాత్మక హార్ముజ్ జలసంధి (Strait of Hormuz) గుండా ప్రయాణించే అంతర్జాతీయ వాణిజ్య నౌకలు, పౌర సిబ్బందిపై ఇరాన్ నిరంతరం దాడులకు పాల్పడుతోందని అమెరికా ఆరోపించింది. అంతర్జాతీయ నౌకాయాన స్వేచ్ఛను కాపాడటానికి, అమెరికా అధ్యక్షుడు ఇచ్చిన ఆదేశాల మేరకే తాము ఇరాన్ సామర్థ్యాన్ని దెబ్బతీసేందుకు అదనపు వైమానిక దాడులు ప్రారంభించినట్లు సెంట్‌కామ్ ప్రకటించింది. ఇరు దేశాల రణగర్జనలతో మధ్యప్రాచ్యం మరో మహా యుద్ధానికి వేదిక వుతుందా అనే భయాందోళనలు ప్రపంచ దేశాల్లో వ్యక్తమవుతున్నాయి.

# ఢిల్లీకి ఏటీఎంలా రేవంత్ సర్కార్ : జేపీ నడ్డా



**హైదరాబాద్, జూలై 09 :** రేవంత్‌రెడ్డి సర్కారు ఢిల్లీకి ఏటీఎంలా మారిందని కేంద్ర మంత్రి జేపీ నడ్డా ఆరోపించారు. రేవంత్ రెడ్డి లెక్కల్లో వీక్ అని.. కేంద్రం తెలంగాణకు ఏం చేసిందో లెక్కలు చూస్తే తెలుస్తుందని అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ నాయకులతో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలు తీర్చడంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందని నడ్డా విమర్శించారు.రాష్ట్ర బీజేపీలో డోర్స్ ఓపెన్ చేయాలని, వేరే పార్టీవాళ్లు చేరితేనే బీజేపీకి బలం అని పేర్కొన్నారు. పార్టీలో చేరికలను అడ్డుకోవద్దని నేతలను హెచ్చరించారు. కార్యకర్తలతో సఖ్యతగా లేకుంటే ఇబ్బందులు తప్పవని హితవు పలికారు. పార్టీలో కొత్తవాళ్లని కలుపుకొనిపోవాలని, పాతవాళ్లతో సమన్వయం చేసుకొని పనిచేయాలని సూచించారు. అంతకుముందు ఆయన బీబీనగర్ ఎయిమ్స్‌ను సందర్శించారు. మేధావుల సదస్సులో పాల్గొన్నారు

# విద్యార్థులకు రేపు స్కూళ్లు, కాలేజీల బంద్..!!



**హైదరాబాద్, జూలై 09 :** విద్యార్థులకు కీలక అప్డేట్. రేపు (శుక్రవారం) అన్ని విద్యా సంస్థలు బంద్ కానున్నాయి. విద్యార్థి సంఘాలు 10వ తేదీన బంద్ కు పిలుపునిచ్చాయి. ప్రభుత్వ పాఠశాలల సంఖ్యను తగ్గించాలన్న ప్రయత్నాలను మానుకోవాలని, విద్యాశాఖకు మంత్రిని కేటాయించటం సహా పలు విద్యారంగ సమ్యలను పరిష్కరించాలంటూ వామపక్ష విద్యార్థి సంఘాలు ఈ బంద్ కు నిర్ణయించాయి. దీంతో, రేపు రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థలు బంద్ చేయనున్నారు. తెలంగాణ వ్యాప్తంగా రేపు (శుక్రవారం) విద్యా సంస్థలు బంద్ కానున్నాయి. సుదీర్ఘ కాలంగా పెండింగ్ లో ఉన్న విద్యా సంబంధిత సమస్యల పరిష్కారం కోరుతూ వామపక్ష విద్యార్థి సంఘాలు ఉమ్మడిగా ఈ బంద్ కు పిలుపునిచ్చాయి. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల సంఖ్యను తగ్గించాలన్న ప్రయత్నాలను మానుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 27వేల ప్రభుత్వ పాఠశాలలు ఉంటే వాటి సంఖ్యను 4వేలకు తగ్గించాలని సర్కారు భావిస్తోందని విద్యార్థి సంఘాలు ఆరోపించాయి. ఈ ప్రయత్నాన్ని మానుకోవాలని ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజులను నియంత్రిస్తూ చట్టం చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ బంద్ కు అన్ని విద్యా సంస్థలు సహకరించాలని ఇప్పటికే సంఘాల నేతలు కోరారు. అదే విధంగా రాష్ట్రంలో పలు పాఠశాలల్లో ఖాళీగా ఉన్నఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న పాఠశాలలు, హాస్టల్స్ , గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని వామపక్ష విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి. ఇంటర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని తక్షణం అమలు చేయాలని విద్యాహక్కు చట్టం అమలు చేసి అన్ని విద్యా సంస్థల్లో పేదలకు 25 శాతం ఉచిత ప్రవేశాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. అదే విధంగా ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థల్లో విచ్చలవిడిగా పుస్తకాలు, నోట్ బుక్స్ విక్రయాన్ని అడ్డుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ఆయా డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ పాటించాలని నిర్ణయించాయి.

# 75 ఏళ్ల చరిత్రలోనే మహా విపత్తు..!




భూగోళాన్ని వణికించబోతున్నఎల్ నినో గ్లోబల్ వాతావరణ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ఒక పెను ముప్పు భూగోళాన్ని చుట్టుముట్టబోతోంది. పసిఫిక్ మహాసముద్రంలో అత్యంత వేగంగా బలపడుతున్న 'ఎల్ నినో' వాతావరణ దృగ్విషయం.. గత 75 ఏళ్లలోనే అత్యంత శక్తిమంతమైనదిగా, వినాశకరమైనదిగా మారే ప్రమాదం ఉందని ప్రపంచ వాతావరణ శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే 1 డిగ్రీ సెల్సియస్ (1.8 ఫారెన్‌హీట్) ఎక్కువగా నమోదవుతున్నాయి. ప్రత్యేకించి తూర్పు పసిఫిక్ పరిసర ప్రాంతాలలో సాధారణం కంటే ఏకంగా 2.7 డిగ్రీల సెల్సియస్ అదనపు వేడి రికార్డవడం వాతావరణ శాస్త్రవేత్తలను సైతం విస్మయానికి గురిచేస్తోంది. ఈ నేపథ్యంలో, రాబోయే నెలల్లో ఇది మరింత బలపడి 'అత్యంత తీవ్రమైన ఎల్ నినో'గా రూపాంతరం చెందడానికి 81 శాతం అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీనివల్ల సముద్ర వాతావరణం తిరిగి సాధారణ స్థితికి చేరుకోవడానికి కేవలం 3 శాతం మాత్రమే అవకాశం ఉందని, ఉపరితలం చల్లబడే 'లా నినా' ప్రక్రియ ఇప్పట్లో సంభవించే వీల్లేదని నిపుణులు తేల్చి చెప్పారు. ఈ విపరీత గ్లోబల్ వాతావరణ మార్పుల ప్రభావం ఇప్పటికే భారతదేశంపై స్పష్టంగా పడటం ప్రారంభమైంది. దేశవ్యాప్తంగా ఎండల తీవ్రత విపరీతంగా పెరగడంతో వివిధ రాష్ట్రాల్లో భూగర్భ జలాలు, ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు ప్రమాదకర స్థాయికి పడిపోతున్నాయి. ఈ నీటి కొరత ప్రత్యక్షంగా దేశీయ విద్యుత్ రంగాన్ని తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టివేస్తోంది. నీటి పరిమాణం తగ్గడం వల్ల జలవిద్యుత్ కేంద్రాల నుండి విద్యుత్ ఉత్పత్తి గత ఏడాదితో పోలిస్తే ఏకంగా 21 శాతం మేర క్షీణించింది. ఫిబ్రవరి 2024 తర్వాత మన దేశంలో జలవిద్యుత్ రంగంలో చోటుచేసుకున్న అతిపెద్ద పతనం ఇదే కావడం గమనార్హం. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో ప్రధాన డ్యామ్‌ల ఆధారిత విద్యుత్ ఉత్పత్తి దాదాపు 7 శాతం తగ్గడంతో.. దేశంలో పెరిగిన రికార్డు స్థాయి విద్యుత్ డిమాండ్‌ను తట్టుకోవడానికి బొగ్గు, అణుశక్తి అలాగే పునరుత్పాదక ఇంధన రంగాలపై భారత్ ఎక్కువగా ఆధారపడాల్సి వస్తోంది. మరోవైపు గ్లోబల్ మార్కెట్లు, అంతర్జాతీయ వ్యవసాయ రంగాన్ని కూడా ఎల్ నినో గట్టిగా దెబ్బతీయబోతోంది. ఆస్ట్రేలియా వ్యాప్తంగా వర్షపాతం పూర్తిగా క్షీణించి, తీవ్రమైన కరువు పరిస్థితులు అలాగే భారీ కార్చిచ్చులు (ఖీశీతీవర్ ఖీఱతీవం) సంభవించే ప్రమాదం పొంచి ఉంది. అలాగే అమెరికా దక్షిణ ప్రాంతాలలో సాధారణం కంటే చల్లటి ఉష్ణోగ్రతలు, అదనపు వర్షపాతం నమోదు కావచ్చు. అయితే, కరేబియన్ దీవుల పరిసర ప్రాంతాలలో గాలి తీవ్రత పెరగడం వల్ల అట్లాంటిక్ మహాసముద్రంలో బలపడే తుపానుల సంఖ్య తగ్గే అవకాశం కనిపిస్తోందని అక్యూవెదర్ వంటి అంతర్జాతీయ సంస్థలు అంచనా వేస్తున్నాయి. ఏది ఏమైనప్పటికీ, 75 ఏళ్ల తర్వాత ప్రకృతి విసురుతున్న ఈ భారీ సవాలును తట్టుకోవడానికి ప్రపంచ దేశాలు అత్యంత వ్యూహాత్మక ప్రణాళికలతో సిద్ధం కావాల్సిన అత్యవసర సమయం ఆసన్నమైంది.



# మనవడి కోరిక తీర్చిన సీఎం. "తాత.. నువ్వు పూరీలు వేస్తేనే తింటా"

నిత్యం ప్రజా సమస్యలు, రాజకీయ సమీక్షలు, అధికారిక పర్యటనలతో క్షణం తీరిక లేకుండా గడిపే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్కసారిగా 'సాధారణ తాత'గా మారిపోయారు. చాలా బిజీగా ఉండే ముఖ్యమంత్రి హోదాను పక్కనబెట్టి, కన్నకూతురి కొడుకైన తన ముద్దుల మనవడి కోసం వంటగదిలోకి అడుగుపెట్టారు. "తాత.. నువ్వు పూరీలు వేస్తేనే తింటా" అంటూ మనవడు అడిగిన ముద్దు ముద్దు మాటలకు సీఎం రేవంత్ రెడ్డి మురిసిపోయారు. మనవడి కోరికను కాదనలేక స్వయంగా ఆయనే కిచెన్‌లో పిండి కలిపి పూరీలు ఒత్తుతూ, వాటిని నూనెలో వేస్తూ సరదాగా గడిపారు. దీనికి సంబంధించిన వీడియోను ముఖ్యమంత్రి స్వయంగా సోషల్ మీడియా వేదికగా పంచుకోగా, అది కాస్తా క్షణాల్లో వైరల్‌గా మారింది.

# టీడీపీ నుండి వచ్చినవారే నన్ను టార్గెట్ చేస్తున్నారు

● మంత్రి కొండా సురేఖ

తెలంగాణ రాజకీయాలలో వరంగల్ వేదికగా కాంగ్రెస్ పార్టీ నేతల మధ్య రసవత్తర రాజకీయం కొనసాగుతుంది. దేవాదాయ శాఖా మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గుమంటుంది. తాజాగా కడియం శ్రీహరిపైన ప్రోటోకాల్ పాటించలేదని మంత్రి కొండా సురేఖ ఏకంగా సీఎం రేవంత్ రెడ్డికి, ఏఐసీసీకి ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత మంత్రి కొండా సురేఖను పరోక్షంగా టార్గెట్ చేసిన కడియం శ్రీహరి కొందరు కాంట్రవర్సీలు చేస్తూనే ప్రజల మధ్యలో ఉండాలని అనుకుంటారని సెటైర్లు వేశారు. అయితే తాజాగా ఈ వ్యవహారంపై మంత్రి కొండా సురేఖ కడియం శ్రీహరిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. దేవాదాయ శాఖా కార్యాలయంలో ఎమ్మెల్యేలు నేరుగా సమీక్షలు నిర్వహించటం ప్రభుత్వ ప్రోటోకాల్ ను అతిక్రమించటం అని ఆమె ఆరోపించారు. ఇలాంటి చర్యలు సరైనవి కాదని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. కడియం శ్రీహరి తనను రాజకీయంగా ఇబ్బంది



పెట్టాలని ప్రయత్నాలు చేస్తున్నారని కొండా సురేఖ ఆరోపణలు గుప్పించారు. ఒక ఎమ్మెల్యే మంత్రి శాఖలో నేరుగా సమావేశాలు నిర్వహించి. సమీక్షలు చేయటం సముచితం కాదని, ఇది ప్రభుత్వ నియమాలకు విరుద్ధమని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉన్న ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గంలో వివిధ శాఖలలో ఉన్న సమస్యలపై ఆయా మంత్రులను కలిసి చర్చించవచ్చని కానీ నేరుగా కార్యాలయాల్లో జోక్యం చేసుకోవటం తగదని మంత్రి కొండా సురేఖ అన్నారు. ఈ వ్యవహారంపై కడియం శ్రీహరి తనకు సమాధానం చెప్పాలని మంత్రి కొండా సురేఖ డిమాండ్ చేశారు. ఒక బీసీ మహిళ అయిన తనను అవమానించాలని చూస్తున్నారని కొండా సురేఖ ఆరోపించారు. ప్రజా ప్రతినిధులు, మంత్రుల అధికార పరిధుల గురించి కనీసం అవగాహన ఉండాలన్నారు. తన వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగించే విధంగా ప్రవర్తించడం సరికాదని కొండా సురేఖ అన్నారు. తెలుగుదేశం పార్టీ నుండి వచ్చిన నేతలే తనపైన దాడి చేస్తున్నారని, కాంగ్రెస్ పార్టీలో మొదటనుండి ఉన్న వాళ్ళతో తనకు ఎలాంటి ఇబ్బంది లేదని అన్నారు. ఇక ఈ వ్యాఖ్యలతో కొండా సురేఖ కడియం శ్రీహరిని మాత్రమే కాదు టీడీపీ నుండి కాంగ్రెస్ లోకి వచ్చిన నాయకులను , మంత్రులు అయిన వారిని టార్గెట్ చేశారు.

# విపత్తుల సమయంలో ఎస్డీఆర్ఎఫ్ కీలకం..

**-ఎప్పుడైనా సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలి..**

**-హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

విపత్తుల సమయంలో స్టేట్ డిసాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్ డీ ఆర్ ఎఫ్) అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధి సర్దాపూర్ లోని 17 వ బెటాలియన్ లో స్టేట్ డిసాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్ డీ ఆర్ ఎఫ్) ఆద్వర్యంలో విపత్తులు, వరదలు వచ్చే సమయంలో ఉపయోగించే యంత్రాలు, పరికరాల ప్రదర్శన గురువారం నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాధితులను గుర్తించే కెమెరా, రిమోట్ కంట్రోల్ లైఫ్ బోయ్ (ప్రాణరక్షక తేలియాడే పరికరం), తనిఖీ రంధ్రం చేసే పరికరం, ఎత్తైన వెలుతురు స్తంభం (లైట్ మాస్ట్), రక్షణ కార్యక్రమాల కోసం ఉపయోగించే రోటరీ కట్టింగ్ యంత్రం, గాలి ద్వారా బరువులను ఎత్తే లిఫ్టింగ్ బ్యాగ్, పీవీసీ రక్షణ దుస్తులు, హైడ్రాలిక్ స్ప్రెడర్ కట్టర్ (లోహాన్ని విప్పే, కత్తిరించే పరికరం) ప్రదర్శన లో పెట్టగా, జిల్లా కలెక్టర్, ఎస్పీ, అధికారులతో కలిసి పరిశీలించారు. ఒక్కో యంత్రం పనితీరు, వాటిని ఉపయోగించే విధానాన్ని వివరించారు. గత ఏడాది వరదలు వచ్చినప్పుడు కామారెడ్డి, వరంగల్ ఇతర ప్రాంతాల్లో ఎస్ డీ ఆర్ ఎఫ్ టీమ్ అందించిన సేవల వీడియోలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. జిల్లాలో నాలుగు రిజర్వాయర్లు ఎగువ మానేరు, మధ్య మానేరు, అన్నపూర్ణ, మల్కపేట ఉన్నాయని తెలిపారు. వర్షాకాలంతో పాటు సెప్టెంబర్, అక్టోబర్ నెలలో భారీ వరదలు వచ్చే ప్రమాదం ఉంటుందని పేర్కొన్నారు. ఎస్ డీ ఆర్ ఎఫ్ బృందం శిక్షణ లో నేర్చుకున్న అంశాలు విపత్తులు సంభవించినప్పుడు తక్షణమే వినియోగించాల్సి వస్తుందని తెలిపారు. అప్పుడు ప్రతి నిమిషం విలువైందని స్పష్టం చేశారు. రెవెన్యూ, పోలీస్, ఫైర్, ఎస్డీఆర్ఎఫ్ అధికారులు ఒక టీమ్ గా సమాచారం చేరవేస్తూ.. వరదలు వచ్చినప్పుడు సమన్వయంతో సేవలు అందించాలని ఆదేశించారు. గత ఏడాది వరదలు వచ్చినప్పుడు వివిధ జిల్లాల్లో ఉత్తమ సేవలు అందించిన ఎస్డీఆర్ఎఫ్ బృందం, ఇతర అధికారులను అభినందించారు. ఎప్పుడైనా సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి గితే మాట్లాడుతూ.. వర్షాలు వస్తే సేవలు అందించేందుకు ఎప్పుడైనా సిద్ధంగా ఉండాలని సూచించారు. గత ఏడాది వరదలు సంభవించి ఇబ్బంది పడిన చోట్ల అధికారులు పరిశీలించి.. ఇంకా కావలసిన ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. విపత్తులు సంభవించినప్పుడు వాడే పరికరాలు, యంత్రాలతో మాక్ డ్రిల్ నిర్వహించాలని ఆదేశించారు. ఇంకా ఏమైనా యంత్రాలు, పరికరాలు కావాల్సి ఉంటే ముందస్తుగా తెప్పించాలని సూచించారు. ఉత్తమ సేవలు అందిస్తున్న అధికారులు, సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, కమాండెంట్ పీ జె.పి.సి. ఛటర్జీ, అడిషనల్ కమాండెంట్ ఎంఐ సురేష్, అసిస్టెంట్ కమాండెంట్ సురేష్, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ వెంకటేశ్వర్లు, ఎస్డీఆర్ఎఫ్ ఆర్ఐ బండి శ్రీనివాస్, తహసీల్దార్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి..



**-- వైద్యాధికారులు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లకు డీఎంహెచ్‌వో డా. ఏంజెలా ఆల్ఫ్రెడ్ శిక్షణ**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వ వైద్యాధికారులు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లకు జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో నిర్వహించినట్లు జిల్లా వైద్య ఉ ఆరోగ్య అధికారి డా. ఏంజెలా ఆల్ఫ్రెడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. శిక్షణలో పొందిన మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేసి, లక్ష్యానికి అనుగుణంగా ప్రతి అర్హులైన బాలబాలికకు అల్బెండాజోల్ మాత్రలు అందేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లను ఆదేశించారు. జిల్లాలో 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల ప్రతి బాలబాలికకు అల్బెండాజోల్ మాత్రలు అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమం రోజున మాత్రలు తీసుకోలేకపోయిన పిల్లలకు జూలై 20, 2026న మాప్-అప్ డే నిర్వహించి తప్పనిసరిగా మాత్రలు అందించాలని సూచించారు. వయస్సు వారీగా అల్బెండాజోల్ మాత్రల మోతాదును వివరిస్తూ, 1--2 సంవత్సరాల పిల్లలకు అర మాత్రను పొడి చేసి నీటితో, 2--3 సంవత్సరాల పిల్లలకు ఒక మాత్రను పొడి చేసి నీటితో, 3--19 సంవత్సరాల పిల్లలకు ఒక మాత్రను బాగా నమిలించి అనంతరం నీటితో మింగేలా చూడాలని తెలిపారు. తల్లిదండ్రులకు కార్యక్రమంపై ముందస్తు సమాచారం అందించి, పిల్లలను తప్పనిసరిగా కార్యక్రమంలో పాల్గొనేలా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి పాఠశాలలో ఒక నోడల్ టీచర్‌ను నియమించి, ప్రతి తరగతి క్లాస్ టీచర్ తన విద్యార్థులకు మాత్రలు వేయించే బాధ్యతను తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలకు ముందస్తు శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. అల్బెండాజోల్ మాత్రలను ఎట్టి పరిస్థితుల్లోనూ పిల్లలకు ఇంటికి పంపించరాదని, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు లేదా నిర్దేశిత కేంద్రాల్లోనే పర్యవేక్షణలో వేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమం విజయవంతం కావడానికి స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, మతపెద్దలు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమానికి సంబంధించిన నివేదికలను సకాలంలో, ఖచ్చితంగా సమర్పించాలని వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బందికి ఆదేశించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డా. రామకృష్ణ, డా. నాగేంద్ర బాబు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు (ఎంఎల్‌హెచ్‌పీలు) తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయానికి

# అప్రోచ్ రోడ్డు ఆనకట్ట నిర్మాణానికి వెంటనే నిధులు మంజూరు చేయాలి..



**లేదంటే బీజేపీ ఆధ్వర్యంలో భారీ ఉద్యమం తప్పదు..**

**బీజేపీ బోయినిపల్లి మండల అధ్యక్షులు ఎడపల్లి పరశురామ్**

**బలగం టీవీ, బోయినిపల్లి:**

భారతీయ జనతా పార్టీ బోయినిపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో మండల అధ్యక్షులుఆ ఎడపల్లి పరశురామ్ నాయకత్వంలో రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం వరదవెల్లి గ్రామంలోని శ్రీ స్వయంభూ దత్తాత్రేయ స్వామి వారి ఆలయాన్ని గురువారం రోజున సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి అప్రోచ్ రోడ్డు, ఆనకట్ట నిర్మాణంపై తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి జ్ఞానోదయం కలగాలని స్వామివారిని ప్రార్థించారు.

ఈ సందర్భంగా ఎడపల్లి పరశురామ్ మాట్లాడుతూ: సుమారు 500 సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయం వేలాది మంది భక్తుల ఆరాధ్య దైవమని పేర్కొన్నారు. అయితే ఆలయానికి వెళ్లే మార్గం లేకపోవడంతో భక్తులు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.దాదాపు రెండేళ్ల క్రితం తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆలయాన్ని సందర్శించి, మధ్యమానేరు జలాశయం కారణంగా భక్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి, అప్రోచ్ రోడ్డు మరియు ఆనకట్ట నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అనంతరం ఇరిగేషన్ శాఖ అధికారులు సుమారు రూ.8.80 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపినప్పటికీ, ఇప్పటి వరకు నిధులు మంజూరు కాకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ భక్తుల ఇబ్బందులను గుర్తించి, బోటు కొనుగోలుకు నిధులు మంజూరు చేసి, ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించారని తెలిపారు. ఆ సేవకు ప్రాంత ప్రజలు, భక్తులు ఎల్లప్పుడూ కృతజ్ఞతలు తెలుపుతారని అన్నారు.అయితే పర్యాటక శాఖ అధికారులు బోటు నిర్వహణ విషయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకుండా ఆలయ కమిటీని నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ లు శంకుస్థాపనలు, హామీలకే పరిమితమై పనులు ప్రారంభించడంలో పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయానికి అప్రోచ్ రోడ్డు, ఆనకట్ట నిర్మాణానికి అవసరమైన నిధులను విడుదల చేసి, పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేకపోతే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో భక్తులు, గ్రామస్తులతో కలిసి పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నరసింహాచారి, మండల ప్రధాన కార్యదర్శులు రాజేంద్ర ప్రసాద్, మెరుపుల గంగాధర్ గౌడ్, మండల ఉపాధ్యక్షులు పసికంటి వెంకటేశం, అన్నిమల్ల మోహన్ బాబు, ఇల్లందుల బాలయ్య, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు జువ్వెంతుల శ్రీనివాస్ రెడ్డి, యువమోర్చా మండల అధ్యక్షులు మిరియాల శరత్ చంద్రారెడ్డి, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు తిప్పరవేని శ్రీనివాస్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు సుంకపాక ప్రభు, సీనియర్ నాయకులు కొంకటి హరీష్, స్వామి కుమార్, సారంపల్లి రాజు, హనుమంత్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, విజయేందర్ రెడ్డి, ప్రసాద్, ఆలయ కమిటి సభ్యులు,తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మున్నూరు కాపు పెద్ద సంఘం ఆధ్వర్యంలో అమ్మవార్లకు బోనాల సమర్పణ..

**బలగం టీవీ, రుద్రంగి :**

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామంలో గురువారం మున్నూరు కాపు పెద్ద సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ, ఎల్లమ్మ, మారెమ్మ, పెద్దమ్మ తాతమ్మ అమ్మవార్లకి బోనాల మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. సంప్రదాయ వస్త్రధారణలో మహిళలు బోనాలను తలపై మోసుకుంటూ డప్పు చప్పుళ్ళ, మంగళ వాయిద్యాల నడుమ గ్రామ వీధుల గుండా ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామ సంప్రదాయం ప్రకారం యాట పిల్లలను కొయ్యడం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించి గ్రామ ప్రజలకు సుఖశాంతులు, రైతులకు సమృద్ధిగా పంటలు, ప్రతి కుటుంబానికి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని వేడుకున్నారు. డప్పు వాయిద్యాల మోతతో గ్రామమంతా భక్తిమయ వాతావరణం ఏర్పడింది. ఈ కార్యక్రమంలో తూము పెద్ద గంగాధర్,తోట శ్రీనినివాస్, జూల గంగాధర్, మూడరాపు బక్కన్న, తూము రాజన్న మున్నూరు కాపు పెద్ద సంఘం సభ్యులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాల మహోత్సవాన్ని విజయవంతం చేశారు. భక్తి, సంప్రదాయం, గ్రామీణ సంస్కృతికి ప్రతీకగా నిలిచిన ఈ వేడుక స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది.





# సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా జాగ్రత్తలు వహించాలి..

- **సర్పంచ్ వెంకట్ రెడ్డి, ఏఎన్ఎం సుమలత,**
- **అల్మాస్ పూర్ కేజీబీవీ లో ఉచిత ఆరోగ్య శిబిరం**
- **166 మందికి వైద్య పరీక్షలు నిర్వహించిన ఆరోగ్య సిబ్బంది**

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని అల్మాస్ పూర్ కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం కేజీబీవీ లో గురువారం ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 166 మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి సీజనల్ వ్యాధుల నివారణకు మందులు పంపిణీ చేసినట్లు సర్పంచ్ వెంకట్ రెడ్డి, ఏఎన్ఎం సుమలత, ఆరోగ్య సిబ్బంది తెలియజేశారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులందరూ పరిశుభ్రత పాటించి సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏదైనా ఆరోగ్య సమస్య ఉంటే వెంటనే ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపల్ అజంత, ఆశ వర్కర్లు మనీషా తదితరులు పాల్గొన్నారు.



# ఎన్నికల హామీని నిలబెట్టుకున్న ఉపసర్పంచ్ శైలజ-రాజు

**సొంత ఖర్చులతో అమలు చేసి, ఆదర్శంగా నిలిచారు..**

**బలగం టీవీ, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం విలాసాగర్ గ్రామ తొలి వార్డులో ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీని గ్రామ ఉపసర్పంచ్ పొత్తూరి శైలజ–రాజు సొంత ఖర్చులతో అమలు చేసి, ఆదర్శంగా నిలిచారు.తొలి వార్డులో ఎన్నో సంవత్సరాలుగా నెలకొన్న వీధి వెలుతురు సమస్యను గుర్తించిన ఉపసర్పంచ్ శైలజ–రాజు,ప్రజలు రాత్రి వేళల్లో ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తన సొంత నిధులతో కొత్త విద్యుత్ స్తంభం (కరెంట్ పోల్) ఏర్పాటు చేయించారు. దీంతో వార్డులోని వీధి వెలుతురు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది.ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంతో తొలి వార్డు ప్రజలు ఉపసర్పంచ్ పొత్తూరి శైలజ–రాజుకు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రెండో వార్డు సభ్యుడు దమ్మ వెంకటరమణతో పాటు తొలి వార్డు గ్రామ ప్రజలు, తదితరులు, పాల్గొన్నారు.



# సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు ముందు జాగ్రత్తగా తీసుకోవాలి..

**-ఎంపీఓ గౌరీశంకర్**

**బలగం టీవీ,ఎల్లారెడ్డిపేట:**

ఎల్లారెడ్డిపేట గ్రామపంచాయతీ పరిధిలో వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు ముందు జాగ్రత్తలు తీసుకోవాల్సిన చర్యలు, డ్రై డే కార్యక్రమం, సానిటేషన్ అంశములపై ఆరోగ్య కార్యకర్తలు పంచాయతీ సిబ్బందికి గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎంపీఓ గౌరీశంకర్ అవగాహనా కల్పించారు.వర్షాకాలంలో కాచి,వడపోసి ,చల్లార్చిన, నీటిని మాత్రమే తాగాలని, ఆర్ వో వాటర్ ప్లాంట్ నీటిని టీడీఎస్ నాణ్యత ప్రమాణాలను పాటించిన పిదప మాత్రమే ఆ నీటిని త్రాగాలని ,గ్రామంలో గల అన్ని ఆర్వో వాటర్ ప్లాంట్లను సందర్శించి టీడీఎస్ నాణ్యత ప్రమాణాలు పాటించాలని, అలా పాటించని ఆర్వో ప్లాంట్లను మూసి వేయడం జరుగుతుందని ఎంపీ ఓ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ ప్రశాంత్,స్థానిక సర్పంచ్ ఎలగందుల నర్సింలు ,ఉప సర్పంచ్ బాల్ రెడ్డి, వార్డు సభ్యులు , పంచాయతీ కార్యదర్శి కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



# ఘనంగా ఏబీవీపీ 78వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు..

**బలగం టీవీ, ఇల్లంతకుంట:**

జాతీయ విద్యార్థి దినోత్సవాన్ని పురస్కరించుకుని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) 78వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గురువారం ఇల్లంతకుంట మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంద వంశీకృష్ణ ఆధ్వర్యంలో ఏబీవీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంద వంశీకృష్ణ మాట్లాడుతూ.. దేశంలో అతిపెద్ద విద్యార్థి సంఘంగా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ గుర్తింపు పొందిందని అన్నారు. 1949లో నలుగురు విద్యార్థులతో ప్రారంభమైన ఏబీవీపీ నేడు దేశవ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో అత్యధిక సభ్యత్వం కలిగిన విద్యార్థి సంఘంగా ఎదిగిందని పేర్కొన్నారు. దేశం, ధర్మం, సంస్కృతి పరిరక్షణతో పాటు జాతీయ భావజాలాన్ని విద్యార్థుల్లో పెంపొందించేందుకు ఏబీవీపీ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాలు చేపట్టడంతో పాటు సమాజ హితం కోసం స్థాపన నాటి నుంచి నేటి వరకు అలుపెరగని సేవా కార్యక్రమాలు, పోరాటాలు నిర్వహిస్తున్న ఏకైక విద్యార్థి సంస్థ ఏబీవీపీ అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో విష్ణు, హరీష్, శివమణి, అరుణ్, ఫయాజ్, అంకిత్, చందూ, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## బస్తీ దవాఖానాల తనిఖీలకు ప్రత్యేక అధికారుల నియామకం

**వర్షాకాలంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం: మంత్రి పొన్నం ప్రభాకర్**

**బలగం టీవి, హైదరాబాద్**



హైదరాబాద్ జిల్లా పరిధిలోని 169 బస్తీ దవాఖానల పనితీరు, ప్రజలకు అందుతున్న వైద్య సేవల నాణ్యతను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈనెల 10వ తేదీన ఈ ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

తనిఖీల సమన్వయ బాధ్యతలను స్వయంగా పర్యవేక్షిస్తూనే, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, జిల్లా కలెక్టర్ డా. ప్రియాంక అలా లతో కలిసి రాబోయే రెండు మూడు రోజుల పాటు ఎంపిక చేసిన కీలక బస్తీ దవాఖానలను స్వయంగా సందర్శించి తనిఖీలు చేపట్టనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు వంటి సీజనల్ వ్యాధులను సమర్థవంతంగా నియంత్రించేందుకు బస్తీ దవాఖానలను మరింత బలోపేతం చేయడం, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ఈ ప్రత్యేక పర్యవేక్షణ ప్రధాన ఉద్దేశమని ఆయన తెలిపారు.

బస్తీ దవాఖానల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన సేవలు అందించాలని, మందుల నిల్వలు, ప్రయోగశాల సేవలు, పరిశుభ్రత, అవసరమైన మౌలిక వసతులు తదితర అంశాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని మంత్రి ఆదేశించారు. గుర్తించిన లోపాలను వెంటనే సరిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ప్రాథమిక వైద్య సేవలు అందించడంలో బస్తీ దవాఖానలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, వర్షాకాలంలో ప్రజల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి అన్నారు. ప్రతి బస్తీ దవాఖాన ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా పనిచేయాలని సూచించారు.

హైదరాబాద్ జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో తమ పరిధిలో ఉన్న బస్తీ దవాఖానలను స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, కార్పొరేటర్లు మరియు ఇతర ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా సందర్శించి అక్కడి పరిస్థితులను సమీక్షించాలని మంత్రి కోరారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులతో సమన్వయం చేయాలని సూచించారు. ప్రజల ఆరోగ్యాన్ని అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకుంటున్న ప్రజా ప్రభుత్వం, బస్తీ దవాఖానలను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలను నిరంతరం కొనసాగిస్తుందని హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.




## తెలంగాణ, ఈశాన్య రాష్ట్రాల మధ్య సాంస్కృతిక బంధం బలోపేతం కావాలి

**లా అండ్ ఆర్డర్ డీజీపీ మహేశ్ భగవత్**

**సికింద్రాబాద్ కిమ్స్ హాస్పిటల్స్‌లో 'ఈశాన్య రాష్ట్రాల సంస్కృతి అవగాహన' సదస్సు.. కనువిందు చేసిన బిహు, మణిపురి నృత్యాలు**

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణకు, ఈశాన్య (నార్త్–ఈస్ట్) రాష్ట్రాల మధ్య సాంస్కృతిక వారసత్వ బంధాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ లా అండ్ ఆర్డర్ డీజీపీ ఎం.మహేశ్? భగవత్ అభిప్రాయపడ్డారు. కిమ్స్ హాస్పిటల్స్, నార్త్–ఈస్ట్ కనెక్ట్ అసోసియేషన్ (నెకా – చీజుజూ) సంయుక్తంగా సికింద్రాబాద్‌లోని కిమ్స్ హాస్పిటల్స్ ఆవరణలో నిర్వహించిన 'ఈశాన్య రాష్ట్రాల సంస్కృతి అవగాహన కార్యక్రమం'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

ఈ సందర్భంగా డీజీపీ మహేశ్ భగవత్ మాట్లాడుతూ.. ఈశాన్య రాష్ట్రాల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, భాషల గురించి స్థానికులకు సమగ్ర అవగాహన కల్పించడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. "ప్రస్తుతం ఈశాన్య రాష్ట్రాలకు చెందిన అనేక మంది తెలంగాణలో, అందులోనూ ముఖ్యంగా భాగ్యనగరంలో విద్య, ఉద్యోగ, వైద్య రంగాల్లో స్థిరపడి విశేష సేవలందిస్తున్నారు. మన మధ్యే నివసిస్తున్న వారి సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించి, వారిని ఆదరించడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యత" అని ఆయన వివరించారు. భారతదేశ వైవిధ్యాన్ని దగ్గర చేయడం, పరస్పర గౌరవాన్ని పెంపొందిస్తూ సమ్మిళిత సమాజ నిర్మాణానికి తోడ్పడడమే తమ నెకా ముఖ్య లక్ష్యమని సంస్థ ఉపాధ్యక్షుడు డా. సర్బేశ్వర్ సహారియా పేర్కొన్నారు.

కిమ్స్ హాస్పిటల్స్ ఛైర్మన్ డా.బి.భాస్కరరావు మాట్లాడుతూ.. తమ ఆసుపత్రుల్లో ఈశాన్య రాష్ట్రాలకు చెందిన అనేక మంది నర్సింగ్, పారామెడికల్ విభాగాల్లో అంకితభావంతో సేవలందిస్తున్నారని కొనియాడారు. వారి ప్రత్యేక సంస్కృతి, జీవన విధానాన్ని ఇక్కడి వారు అర్థం చేసుకుని, వారికి మరింత ఆత్మీయమైన, సురక్షితమైన వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు స్పష్టం చేశారు.

అనంతరం నిర్వహించిన సాంస్కృతిక వేడుకలు ప్రేక్షకులను అబ్బురపరిచాయి. అస్సాం రాష్ట్ర సంప్రదాయ 'బిహు' నృత్యం, మణిపురి నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అలాగే ఈశాన్య ప్రాంతానికి చెందిన ఎనిమిది రాష్ట్రాల సంప్రదాయ వస్త్రధారణ (ఎథ్నిక్ఆశీఖుశ్రీ చోఅతీవ) తో యువతులు చేసిన ర్యాంప్ వాక్ ప్రదర్శన అందరినీ మంత్రముగ్ధుల్ని చేసింది. ఈ వేడుకల్లో హైదరాబాద్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ అజైలియు నియుమై ఈశాన్య రాష్ట్రాల సామాజిక విశిష్టతను వివరించగా, సీనియర్ జర్నలిస్ట్ ఎం.సోమశేఖర్ ప్రసంగించారు. కార్యక్రమంలో నెకా అధ్యక్షుడు పాపారావు బియ్యాల, ఉపాధ్యక్షుడు గౌతమ్ సవాంగ్, కోశాధికారి అడ్వొకేట్ స్టీఫెన్ రోనోజిత్ సేన్, బోర్డు సభ్యులు డా. కె. రాజేశ్వరరావు, శ్రీధర్ ముప్పిడి, కిమ్స్ మెడికల్ ఆపరేషన్స్ డైరెక్టర్ డా.సంబిత్ సాహు తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా ఏబీవీపీ 78వ ఆవిర్భావ దినోత్సవం..

**- జాతీయ విద్యార్థి దినోత్సవ వేడుకలు నిర్వహణ..**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ ఆధ్వర్యంలో 78వ జాతీయ విద్యార్థి దినోత్సవం, ఏబీవీపీ 78వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మారం సందీప్ ముఖ్య అతిథిగా పాల్గొని ఏబీవీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మారం సందీప్ మాట్లాడుతూ.. "జ్ఞానం -- శీలం -- ఏకత" అనే మూడు మూల సూత్రాలతో దేశభక్తి, జాతీయవాద భావజాలాన్ని విద్యార్థుల్లో పెంపొందిస్తూ ముందుకు సాగుతున్న ఏకైక జాతీయ విద్యార్థి సంస్థ ఏబీవీపీ అని పేర్కొన్నారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం ఎక్కడ అన్యాయం జరిగినా అక్కడ ఏబీవీపీ కార్యకర్తలు పోరాటం చేస్తారని అన్నారు. దేశ సమగ్రత, జాతీయ విలువల పరిరక్షణలో ఏబీవీపీ కీలక పాత్ర పోషిస్తోందని, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఎన్నో ఉద్యమాలు నిర్వహించిందని తెలిపారు. జైలు శిక్షలు, ఇబ్బందులు, ప్రాణహానులను సైతం లెక్కచేయకుండా విద్యార్థి సమాజం కోసం పోరాడుతున్న దేశంలోనే అతిపెద్ద విద్యార్థి సంస్థ ఏబీవీపీ అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా హాస్టల్ కన్వీనర్ పూజాం కార్తీక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బలగం ఫణి కిషోర్, టౌన్ జాయింట్ సెక్రటరీ రుద్రవీణ ధనుష్, ఉపాధ్యక్షుడు శివ, కార్యకర్తలు మహేందర్, రాజేష్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా భూముల సర్వే నిర్వహించాలి..

**మొదటి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ సర్వే**

**రెవెన్యూ శాఖ కార్యదర్శి డీ ఎస్ లోకేష్ కుమార్**

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:**




భూముల రీ సర్వేను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అత్యంత పారదర్శకంగా నిర్వహించి ప్రతి భూమికి స్పష్టమైన యాజమాన్య హక్కులు కల్పించాలని రెవెన్యూ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేష్ కుమార్ ఆదేశించారు.భూముల రీ సర్వే, నక్ష సర్వే, రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు స్థలాల కేటాయింపుపై రెవెన్యూ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేష్ కుమార్ గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా, జిల్లా సమీకృత కార్యాలయాల సము దాయంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేష్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం భూముల రీ సర్వేను దశలవారీగా చేపడుతోందని తెలిపారు. తొలి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సర్వేతో ప్రతి సర్వే నంబర్‌కు స్పష్టమైన యాజమాన్య హక్కులు నిర్ధారించడంతోపాటు ప్రతి భూమికి ప్రత్యేక భూధార్ యూనిక్ నంబర్ కేటాయించనున్నట్లు తెలిపారు. డీజీపీఎస్ (ఙ+ఙూ), రోవర్స్, జీఐఎస్ (+క్ష్మూ) వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రీ సర్వే చేపట్టాలని ఆదేశించారు. రీ సర్వే జరుగుతున్న ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని, ఆయా గ్రామసభల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, మంత్రులను భాగస్వాములను చేయాలని సూచించారు. రీ సర్వేలో రెగ్యులర్ సర్వేయర్లతో పాటు లైసెన్స్డ్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. సోమవారం నుంచి సర్వేయర్లు, జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బందికి బ్యాచ్‌ల వారీగా సమగ్ర శిక్షణ నిర్వహించి అనంతరం అన్ని గ్రామాల్లో రీ సర్వే కార్యక్రమాలు ప్రారంభించాలని ఆదేశించారు. జిల్లాస్థాయిలో కూడా ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. రీ సర్వే పూర్తయ్యే వరకు రెగ్యులర్ సర్వేయర్లలో 25 శాతం మందిని రొటేషన్ పద్ధతిలో విధుల్లో వినియోగించాలని తెలిపారు. లైసెన్స్డ్ సర్వేయర్ల పనితీరును శాఖ సర్వేయర్లు నిరంతరం పర్యవేక్షించాలని, డిప్యూటీ తహసీల్దార్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో రీ సర్వే పనులను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో రీ సర్వే నాణ్యతతో నిర్వహించాలని, సర్వేలో ఉపయోగించే ఆధునిక పరికరాల వినియోగాన్ని సాంకేతికంగా పర్యవేక్షించే వ్యవస్థ అందుబాటులో ఉందని, వాటిని సమర్థవంతంగా ఉపయోగించాలని సూచించారు. రీ సర్వేలో పాల్గొనే లైసెన్స్డ్ సర్వేయర్లకు ప్రభుత్వం గౌరవ వేతనం అందజేస్తుందని తెలిపారు. భూ భారతి దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం చేయవద్దని సూచించారు. త్వరగా పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవో, వీర్నపల్లి, తంగళ్లపల్లి, వేములవాడ, రుద్రంగిలో నూతన రెవెన్యూ కార్యాలయాలు, వేములవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నిర్మాణానికి స్థలాలు గుర్తించాలని ఆదేశించారు. వేములవాడ లో నక్ష సర్వే నిబంధనల ప్రకారం గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. భూముల రీ సర్వే కోసం కావలసిన సిబ్బంది అందుబాటులో ఉండేలా చూసుకొని..

పని పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులు ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో సిరిసిల్ల ఆర్డీఓ శ్రీధర్ బాబు, వేములవాడ మున్సిపల్ కమిషనర్ లోకేష్, సర్వే ఏడీ శ్రీనివాస్, సబ్ రిజిస్ట్రార్లు, రెవెన్యూ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అనుపురం రోడ్డు ప్రమాదంపై రాష్ట్ర ప్రభుత్వ విప్ తీవ్ర దిగ్భ్రాంతి



**బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుంది: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**జిల్లా ఎస్పీతో కలిసి వేములవాడ ఏరియా ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించిన ప్రభుత్వ విప్**

**బలగం టీవీ, వేములవాడ:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలం అనుపురం సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటనపై రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో ఒకరు మృతి చెందడం పట్ల ఆయన సంతాపం వ్యక్తం చేస్తూ, మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాద వివరాలను పరిశీలించిన అనంతరం జిల్లా ఎస్పీతో కలిసి వేములవాడ ఏరియా ఆసుపత్రిని సందర్శించిన ఆది శ్రీనివాస్, అక్కడ చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు... బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని వైద్య అధికారులను ఆదేశించారు. మహారాష్ట్ర రాష్ట్రానికి చెందిన వ్యవసాయ కూలీలు తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్ ప్రాంతంలో నాట్లు వేసే పనులు ముగించుకుని తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక సమాచారం అందిందని తెలిపారు. అనుపురం వద్ద స్పీడ్ బ్రేకర్ సమీపంలో నెమ్మదిగా వెళ్తున్న టాటా ఏస్ వాహనాన్ని వెనుక నుంచి వచ్చిన బస్సు ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించినట్లు పోలీసుల ప్రాథమిక అంచనా ఉందన్నారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే జిల్లా యంత్రాంగం అప్రమత్తమై సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టిందన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, డీఎస్పీ, సీఐలతో పాటు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వెంటనే స్పందించి క్షతగాత్రులకు చికిత్స అందించే ఏర్పాట్లు చేశారని తెలిపారు. గాయపడిన వారిలో ఇద్దరికి తీవ్ర తల గాయాలు ఉన్న నేపథ్యంలో వైద్యుల సూచన మేరకు వారిని మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. సంబంధిత వైద్యాధికారులు, ఆసుపత్రి సూపరింటెండెంట్‌లతో మాట్లాడి బాధితులకు అత్యవసర వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం వేములవాడ, సిరిసిల్ల ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులందరికీ ప్రభుత్వం తరఫున నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. కొందరికి ఎముకలు విరగడం, చేతులు, కాళ్లకు గాయాలు కావడం వంటి సమస్యలు ఉన్నప్పటికీ వైద్య బృందాలు నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రమాద బాధితులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. ప్రమాదం జరిగిన తర్వాత తొలి గంటను 'గోల్డెన్ అవర్'గా పరిగణించి బాధితులకు తక్షణ వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ చేపడతామని, బస్సు డ్రైవర్ నిర్లక్ష్యమా, వాహన భద్రతా లోపమా లేదా ఇతర కారణాల వల్ల ప్రమాదం జరిగిందా అనే అంశాలను పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు... విచారణలో తేలిన అంశాల ఆధారంగా బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.పొట్టకూటి కోసం సుదూర ప్రాంతం నుంచి వచ్చిన పేద కార్మికులు ప్రమాదానికి గురికావడం అత్యంత బాధాకరమని పేర్కొన్న ఆది శ్రీనివాస్, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అవసరమైతే మరింత మెరుగైన చికిత్స కోసం ఇతర ప్రత్యేక వైద్య కేంద్రాలకు తరలించే ఏర్పాట్లు కూడా ప్రభుత్వం చేపడుతుందని తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా రోడ్డు భద్రతకు సంబంధించిన చర్యలను మరింత బలోపేతం చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

# నాడు బంగారు గని.. నేడు కుంభకోణాల ఖని

**సింగరేణిపై 'బీఆర్ఎస్' ధ్వజం!**

**కేసీఆర్, టీబీజీకేఎస్ పోరాటంతోనే 'తాడిచర్ల' బ్లాక్..**

**కాంగ్రెస్ పెద్దల స్కామ్‌లపై సీబీఐ విచారణ జరపాలి:**

**కొప్పుల ఈశ్వర్, బాల్క సుమన్**

**బలగం టీవి, హైదరాబాద్**




బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నేతృత్వంలో 'టీబీజీకేఎస్' (ఙదీ+ఖూ) చేసిన సుదీర్ఘ పోరాటం వల్లే సింగరేణికి తాడిచర్ల బొగ్గు బ్లాక్ దక్కిందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ స్పష్టంచేశారు. ఇప్పుడు ఈ బ్లాక్ ఘనత తమదేనని కాంగ్రెస్, బీజేపీలు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని ఆయన మండిపడ్డారు. గురువారం తెలంగాణభవన్‌లో టీబీజీకేఎస్ నాయకులు కృష్ణ, సురేందర్‌లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. 1995లోనే తాడిచెర్లను గుర్తించింది సింగరేణేనని, గతంలో ఈ బ్లాక్ వేలాన్ని కేసీఆర్ తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తుచేశారు. గనులను వేలం వేయొద్దని సెక్షన్ 17–ఏ ప్రకారం ప్రధాని మోదీకి లేఖ రాసినా కేంద్రం పట్టించుకోలేదని ఆరోపించారు.

కేసీఆర్ పాలనలో విప్లవాత్మక నిర్ణయాలతో బంగారు గనిగా రూపుదిద్దుకున్న సింగరేణి, ప్రస్తుత కాంగ్రెస్ హయాంలో కుంభకోణాల ఖనిగా మారిందని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తీవ్ర ఆరోపణలు చేశారు. సింగరేణిలో జరుగుతున్న స్కామ్‌లకు సూత్రధారి సీఎం రేవంత్‌రెడ్డి అయితే, పాత్రధారి ఆయన బావమరిది సృజన్‌రెడ్డి అని విరుచుకుపడ్డారు. సీఎం బావమరిది కనుసన్నల్లోనే సింగరేణిలో అక్రమ వ్యవహారాలు నడుస్తున్నాయని, 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైన వ్యవహారంపై తక్షణమే సీబీఐ (జదీక్ష్మీ) విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ కాలంలో 16 వేల మందికి పైగా కారుణ్య నియామకాలు చేపడితే.. కాంగ్రెస్ రెండున్నరేండ్లలో కేవలం 330 మందికే వారసత్వ ఉద్యోగాలిచ్చి చేతులు దులుపుకుందని ధ్వజమెత్తారు.

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎంఎండీఆర్ (వీవీణక్ష్మ) యాక్ట్‌తో సింగరేణి పూర్తిగా నిర్వీర్యమయ్యే పరిస్థితి నెలకొన్నదని కొప్పుల ఈశ్వర్ ఆవేదన వ్యక్తం చేశారు. నాడు వేలం ప్రక్రియ తెచ్చి సింగరేణికి బ్లాక్‌లు దక్కకుండా చేసిన పాపం మోదీ సర్కార్‌దేనని, దాన్ని పార్లమెంట్‌లో అడ్డుకోవాల్సిన కాంగ్రెస్ చేతులెత్తేసిందని దుయ్యబట్టారు. రోజురోజుకూ టీబీజీకేఎస్‌కు పెరుగుతున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకే ఈ రెండు పార్టీలు కుట్రలు, నాటకాలకు తెరలేపాయని విమర్శించారు.

కేంద్రం ఎంఎండీఆర్ యాక్ట్ కింద వేలం పాట విధానాన్ని పక్కనబెట్టి, ఓపెన్ కాస్ట్ (ఉజ) బొగ్గు గనులను నామినేషన్ పద్ధతినే సింగరేణికి కేటాయించాలని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. నాడు బొగ్గు గనుల వేలానికి బీఆర్ఎస్ మినహా అన్ని పార్టీలూ మద్దతిచ్చాయని గుర్తుచేశారు. సాంకేతికత, మానవవనరుల వినియోగంలో సింగరేణి సంస్థ కోల్ ఇండియా కన్నా ఎంతో ముందంజలో ఉన్నదని, ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని తెలంగాణ ఏరియాలోని అన్ని బ్లాక్‌లను సింగరేణికే కేటాయించేలా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చొరవ చూపాలని కోరారు.




## హిమాన్ష బాబు త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మనవడు, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తనయుడు కల్వకుంట్ల హిమాన్ష బాబు త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షిస్తూ సిరిసిల్ల పట్టణంలోని శ్రీ మైసమ్మ తల్లి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు.బీఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమంలో హిమాన్ష బాబు సంపూర్ణ ఆరోగ్యాన్ని పొంది, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో జీవించాలని శ్రీ మైసమ్మ తల్లిని భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు.ఈ సందర్భంగా కంచర్ల రవి గౌడ్ మాట్లాడుతూ.. అమ్మవారి దివ్య ఆశీస్సులతో హిమాన్ష బాబు త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నాయకులు మట్టే శ్రీనివాస్, సదుల శేఖర్, బిక్కనే వేణు యాదవ్, తడిగే రాజు, పరశురాములు, నవీన్ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజల్లో పాల్గొని హిమాన్ష బాబు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు.

## చైనాలో షూ ఫ్యాక్టరీలో భారీ అగ్నిప్రమాదం..

**28 మంది సజీవదహనం!**

**బలగం టీవీ, బీజింగ్**



చైనాలో గురువారం ఒక ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. ఆగ్నేయ చైనాలోని ఫుజియాన్ ప్రావిన్స్‌లో గల ఒక ప్రముఖ షఉ ఫ్యాక్టరీలో ఒక్కసారిగా భారీ మంటలు చెలరేగడంతో.. అందులో పనిచేస్తున్న 28 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాద సమయంలో బహుళ అంతస్తుల భవనంలో మరికొందరు కార్మికులు కూడా చిక్కుకుని ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఘటనా స్థలంలో ప్రస్తుతం సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

చైనాలో 'షూ రాజధాని'గా పిలిచే జిన్‌జియాంగ్ నగరంలోని 'హుయిటెంగ్ షఉస్ ఫ్యాక్టరీ'లో ఈ ఘోర విషాదం చోటుచేసుకుంది. ఫ్యాక్టరీ నడుస్తున్న బహుళ అంతస్తుల భవనంలో గురువారం హఠాత్తుగా మంటలు చెలరేగడంతో నిమిషాల వ్యవధిలోనే పరిసర ప్రాంతమంతా దట్టమైన నల్లటి పొగలు అలుముకున్నాయి. భవనం పైకప్పు (రూఫ్ టాప్) పైకి చేరుకున్న కొందరు కార్మికులు ప్రాణరక్షణ కోసం ఆర్తనాదాలు చేస్తున్న హృదయవిదారక దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే సుమారు 200 మంది అగ్నిమాపక సిబ్బంది 35 ఫైర్ ఇంజన్లతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

**ముడి పదార్థాల వల్లే వేగంగా వ్యాపించిన మంటలు..**

షూ తయారీలో పెద్ద ఎత్తున వినియోగించే కెమికల్స్, రబ్బర్, గ్లూ వంటి తీవ్రంగా మండే స్వభావం కలిగిన ముడి పదార్థాల వల్లే మంటలు అంత వేగంగా భవనం అంతటా వ్యాపించినట్లు స్థానిక అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. చుట్టుపక్కల పొగ ఎక్కువగా ఉండటంతో ఊపిరాడక కూడా కొందరు మరణించినట్లు తెలుస్తోంది.

**అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ తీవ్ర దిగ్భ్రాంతి..**

ఈ దారుణ దుర్ఘటనపై చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ తీవ్ర అగ్నిప్రమాద దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇదొక భారీ ప్రాణ నష్టమని ఆవేదన వ్యక్తం చేస్తూ.. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని, సహాయక చర్యలను మరింత వేగవంతం చేసి బాధితుల కుటుంబాలకు తక్షణమే అండగా నిలవాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి, యాజమాన్యం నిర్లక్ష్యం ఉంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

# హైదరాబాద్‌కు భారీ షాక్..

## టీజీ20' లీగ్ ఫైనల్లోకి ఖమ్మం 'ఏసెస్'!



**క్వాలిఫయర్-1లో 10 పరుగుల తేడాతో అన్విత ఖమ్మం విజయం..**
**మికిల్ జైస్వాల్ మెరుపు హాఫ్ సెంచరీ..**
**హైదరాబాద్ 'ఈ ఛాంపియన్స్'కు టోర్నీలో తొలి**

**బలగం టీవి, హైదరాబాద్**

స్థానిక ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియం వేదికగా జరిగిన టీజీ 20 (౧+20) లీగ్ క్వాలిఫయర్-1లో అన్విత ఖమ్మం ఏసెస్ జట్టు అద్భుత విజయాన్ని నమోదు చేసి, నేరుగా ఫైనల్‌కు దూసుకెళ్లింది. గురువారం రాత్రి జరిగిన హై-స్కోరింగ్ థ్రిల్లర్‌లో ఖమ్మం జట్టు 10 పరుగుల తేడాతో పటిష్ఠమైన హైదరాబాద్ ఈ ఛాంపియన్స్‌ను కంగుతినిపించింది. లీగ్ దశలో ఆడిన ఏడు మ్యాచ్‌ల్లోనూ అజేయంగా నిలిచిన హైదరాబాద్ జట్టుకు ఈ టోర్నీలో ఇదే మొదటి ఓటమి కావడం గమనార్హం.

**మికిల్ జైస్వాల్ విధ్వంసం.. ఖమ్మం భారీ స్కోరు!**

టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన అన్విత ఖమ్మం ఏసెస్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 200 పరుగుల భారీ స్కోరు సాధించింది. మిడిలార్డర్ బ్యాటర్ మికిల్ జైస్వాల్ (34 బంతుల్లో 76 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్‌తో హైదరాబాద్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. అతనికి తోడుగా జీఎస్కే రెడ్డి (40), పరాస్ రాజ్ (32) రాణించారు. హైదరాబాద్ బౌలర్లలో అఖిల్ రాథోడ్ 2 వికెట్లు తీయగా.. ప్రణవ్ వర్మ, అజయ్ గౌడ్, షణ్ముక, దేవ్ మెహతా తలో వికెట్ పడగొట్టారు.

**సాయి వికాస్ పోరాడినా తప్పని ఓటమి..**

201 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ చివరి బంతి వరకు పోరాడి 20 ఓవర్లలో 8 వికెట్లు నష్టపోయి 190 పరుగులకే పరిమితమైంది. ఓపెనర్ సాయి వికాస్ రెడ్డి (69) మెరుపు హాఫ్ సెంచరీతో జట్టును గెలిపించే ప్రయత్నం చేసినప్పటికీ, కీలక సమయంలో వికెట్లు పడటంతో హైదరాబాద్‌కు ఓటమి తప్పలేదు. ఖమ్మం బౌలర్లలో సహేంద్ర మల్లు (3 వికెట్లు), వేద్ రెడ్డి (2 వికెట్లు) అద్భుతంగా బౌలింగ్ చేయగా.. కెప్టెన్ చామ మిలింద్, హర్షిత్ సాయి చెరో వికెట్ దక్కించుకున్నారు.

**నేడే క్వాలిఫయర్-2..**
**హైదరాబాద్‌తో కరీంనగర్ ఢీ!**

ఈ మ్యాచ్‌లో గెలిచిన ఖమ్మం నేరుగా ఫైనల్ చేరగా.. ఓడిపోయిన హైదరాబాద్ ఈ ఛాంపియన్స్‌కు ఫైనల్ చేరడానికి క్వాలిఫయర్-2 రూపంలో మరో అవకాశం ఉంది. శుక్రవారం (నేడు) జరగనున్న క్వాలిఫయర్-2 మ్యాచ్‌లో ఎలిమినేటర్ విజేత 'కరీంనగర్ డైమండ్స్'తో హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ తలపడనుంది. ఇందులో గెలిచిన జట్టు జులై 12 (ఆదివారం) జరిగే గ్రాండ్ ఫైనల్‌లో ఖమ్మం ఏసెస్‌తో టైటిల్ కోసం పోరాడుతుంది.

# క్వాలిఫయర్-2లోకి కరీంనగర్ 'డైమండ్స్'!

**తన్మయ్ అగర్వాల్ 'సంచలన' శతకం..**
**ఎలిమినేటర్‌లో రంగారెడ్డి రైజర్స్‌పై 75 పరుగుల భారీ విజయం..**
**ఆశిష్ శ్రీవాస్తవ్ ఐదు వికెట్ల ప్రదర్శన..**
**ఆరెంజ్ క్యాప్ రేసులో అగ్రస్థానానికి తన్మయ్**

**బలగం టీవి, హైదరాబాద్**

ఉప్పల్ (హైదరాబాద్): శ్రీనిధి యూనివర్సిటీ టీజీ 20 (౧+20) లీగ్‌లో కరీంనగర్ డైమండ్స్ జట్టు సగర్వంగా ముందడుగు వేసింది. ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియం వేదికగా గురువారం మధ్యాహ్నం జరిగిన 'డూ ఆర్ డై' ఎలిమినేటర్ మ్యాచ్‌లో కరీంనగర్ 75 పరుగుల భారీ తేడాతో రంగారెడ్డి రైజర్స్‌ను చిత్తు చేసింది. కరీంనగర్ కెప్టెన్ తన్మయ్ అగర్వాల్ వరుసగా రెండో సెంచరీతో విధ్వంసం సృష్టించడంతో.. రంగారెడ్డి టోర్నీ నుంచి అధికారికంగా ఎలిమినేట్ అయింది. ఈ విజయంతో కరీంనగర్ జట్టు శుక్రవారం (నేడు) జరిగే క్వాలిఫయర్-2కు అర్హత సాధించింది.

**61 బంతుల్లో 137 పరుగులు.. కెప్టెన్ ఇన్నింగ్స్‌తో రికార్డుల వేట!**

టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన కరీంనగర్ డైమండ్స్‌కు కెప్టెన్ తన్మయ్ అగర్వాల్ ఒంటిచేత్తో భారీ స్కోరును అందించాడు. రంగారెడ్డి బౌలర్లను నలుమూలలా బాదుతూ కేవలం 61 బంతుల్లోనే 11 ఫోర్లు, 10 సిక్సర్లతో 137 పరుగుల మైండ్ బ్లోయింగ్ ఇన్నింగ్స్ ఆడాడు. అతనికి తోడుగా హృషికేష్ సింహా (28 బంతుల్లో 50) హాఫ్ సెంచరీతో అదరగొట్టాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు కేవలం 69 బంతుల్లోనే రికార్డు స్థాయి 139 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. దీంతో కరీంనగర్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 238 పరుగుల కొండంత



స్కోరు సాధించింది. ఈ సెంచరీతో తన్మయ్ అగర్వాల్ (మొత్తం 465 పరుగులు) లీగ్‌లో ఆరెంజ్ క్యాప్ రేసులో అగ్రస్థానానికి దూసుకెళ్లాడు.

**ఆశిష్ 'ఫైవ్ వికెట్' హాల్.. రంగారెడ్డి అవుట్!**

239 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన రంగారెడ్డి రైజర్స్ 3 ఓవర్లలోనే 29 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో తనయ్ త్యాగరాజన్ (33 బంతుల్లో 63), కెప్టెన్ నితిన్ సాయి యాదవ్ (30 బంతుల్లో 50)లు అర్ధ శతకాలతో మెరిసి 48 పరుగుల భాగస్వామ్యంతో గెలుపు కోసం గట్టిగానే పోరాడారు. అయితే, శుభమ్ శర్మ బౌలింగ్‌లో తనయ్ అవుట్ అవ్వడంతో రంగారెడ్డి ఆశలు అడియాసలయ్యాయి. కరీంనగర్ బౌలర్ ఆశిష్ శ్రీవాస్తవ్ (5/16) ఐదు వికెట్లతో మారణహోమం సృష్టించడంతో రంగారెడ్డి 16.3 ఓవర్లలో 163 పరుగులకే కుప్పకూలింది.

ఎలిమినేటర్‌లో గెలిచిన కరీంనగర్ డైమండ్స్.. శుక్రవారం (నేడు) జరగనున్న క్వాలిఫయర్-2 మ్యాచ్‌లో క్వాలిఫయర్-1లో ఓడిపోయిన 'హైదరాబాద్ ఈ ఛాంపియన్స్'తో తలపడనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు జులై 12 (ఆదివారం) జరిగే గ్రాండ్ ఫైనల్‌లో 'అన్విత ఖమ్మం ఏసెస్'తో టైటిల్ కోసం తలపడుతుంది.

# బంగ్లాదేశ్‌పై జింబాబ్వే 'సిరీస్' ఘన విజయం..

**పూర్వ వైభవం దిశగా అడుగులు!**
**బెన్ కరన్ అజేయ సెంచరీ.. పేస్ త్రయం ధాటికి కుప్పకూలిన బంగ్లా.. మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0తో వన్డే సిరీస్ కైవసం**

**బలగం టీవి, హైదరాబాద్**



అంతర్జాతీయ క్రికెట్‌లో జింబాబ్వే జట్టు పూర్వ వైభవం దిశగా జైత్రయాత్రను కొనసాగిస్తోంది. అనామక జట్టు అనే ముద్రను తొలగించుకుంటూ ఇటీవల కాలంలో సంచలన విజయాలు సాధిస్తున్న ఈ ఆఫ్రికా జట్టు.. సొంతగడ్డపై మరో సిరీస్‌ను ఖాతాలో వేసుకుంది. ఏకైక టెస్టులో బంగ్లాదేశ్‌ను ఇన్నింగ్స్ తేడాతో చిత్తు చేసిన జింబాబ్వే.. తాజాగా వన్డే సిరీస్‌ను సైతం దక్కించుకుంది. బుధవారం జరిగిన ఉత్కంఠభరిత రెండో వన్డేలో 13 పరుగుల తేడాతో పర్యాటక బంగ్లాదేశ్‌ను మట్టికరిపించి, మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0తో వన్డే సిరీస్‌ను కైవసం చేసుకుంది.

**బెన్ కరన్ క్లాస్ ఇన్నింగ్స్.. శ్రీకారం చుట్టిన శతకం**

మొదట బ్యాటింగ్ చేసిన జింబాబ్వే జట్టులో మిడిలార్డర్ బ్యాటర్ బెన్ కరన్ (111 నాటౌట్) అద్భుత శతకంతో చెలరేగాడు. బంగ్లా బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ ఆఖరి వరకు క్రీజులో నిలబడి జట్టుకు 247 పరుగుల గౌరవప్రదమైన స్కోరును అందించాడు. అనంతరం 248 పరుగుల మోస్తరు లక్ష్యంతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్‌ను జింబాబ్వే బౌలింగ్ దళం తీవ్రంగా వణికించింది.

**హృదయ్, తంజిద్ పోరాడినా తప్పని ఓటమి..**

లక్ష్య ఛేదనలో బంగ్లాదేశ్‌కు ఆరంభంలోనే షాక్ తగిలింది. ఓపెనర్ సౌమ్యా సర్కార్ (5)ను బ్లెస్సింగ్ ముజరబాని త్వరగానే పెవిలియన్ పంపాడు. ఆ తర్వాత నజ్ముల్ హొస్సేన్ శాంటో (9) కూడా విఫలమయ్యాడు. అయితే, ఈ దశలో ఓపెనర్ తంజిద్ హసన్ (57), తౌహిద్ హృదయ్ (60) బాధ్యతాయుతంగా ఆడి అర్ధ శతకాలతో మెరిశారు. వీరిద్దరూ అద్భుత పోరాటంతో ఒకానొక దశలో మ్యాచ్‌ను బంగ్లాదేశ్ వైపు తిప్పేలా కనిపించారు.

**తోకముడిచిన బ్యాటర్లు.. పేస్ త్రయం విజృంభణ**

అయితే, ఈ సెట్ బ్యాటర్లు అవుట్ అవ్వడమే ఆలస్యం.. జింబాబ్వే పేస్ త్రయం రిచర్డ్ నగవర (3/55), బ్లెస్సింగ్ ముజరబాని (2/33), బ్రాడ్ ఎవాన్స్ (2/48) వినాశనం సృష్టించారు. వీరి ధాటికి మిగతా బంగ్లాదేశ్ బ్యాటర్లు ఎవరూ క్రీజులో నిలదొక్కుకోలేక తోకముడిచారు. దీంతో బంగ్లాదేశ్ జట్టు 48.1 ఓవర్లలోనే 234 పరుగులకు కుప్పకూలి ఓటమిపాలైంది. కాగా, ఇరుజట్ల మధ్య నామమాత్రమైన మూడో వన్డే జూలై 11, శనివారం జరగనుంది.

## లార్డ్స్‌లో చరిత్ర సృష్టించేందుకు సిద్ధమైన భారత మహిళల జట్టు

**బలగం టీవి, హైదరాబాద్**

ప్రతిష్ఠాత్మక లార్డ్స్ మైదానంలో ఇంగ్లండ్‌తో జరగనున్న ఏకైక టెస్టు మ్యాచ్‌కు భారత మహిళల జట్టు సిద్ధమవుతోంది. 150 ఏళ్ల చరిత్ర కలిగిన లార్డ్స్‌లో నిర్వహిస్తున్న తొలి మహిళల టెస్టు కావడంతో ఈ మ్యాచ్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. మ్యాచ్‌కు ముందు భారత క్రికెటర్లు గురువారం ప్రత్యేక ఫొటో షూట్‌లో పాల్గొని సందడి చేశారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, వైస్ కెప్టెన్ స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్లు బ్యాట్లతో పోజులివ్వగా, పేసర్ రేణుకా సింగ్ ఠాకూర్ బంతితో కెమెరాకు స్టిల్ ఇచ్చింది.

మహిళల టీ20 ప్రపంచకప్ వైఫల్యం నుంచి బయటపడిన టీమిండియా, ఈ టెస్టులో విజయంతో తిరిగి ఆత్మవిశ్వాసాన్ని చాటుకోవాలని భావిస్తోంది. జెర్సీలు ధరించి లార్డ్స్ మైదానంలో దిగ్గజాల ఫొటోల మధ్య ఫొటోలకు పోజులిచ్చిన భారత ఆటగాళ్లు ఉత్సాహంగా కనిపించారు. స్క్వాడ్‌లోని షఫాలీ వర్మ, యస్తికా భాటియా, శ్రీ చరణి, నందిని శర్మ, దీప్తి శర్మ, హర్లీన్ డియోల్ తదితరులు కూడా ఫొటోషుట్‌లో పాల్గొన్నారు. ఇరుజట్ల మధ్య గతంలో జరిగిన ఏకైక టెస్టులో భారత్ 347 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసింది. అలాగే 2006 నుంచి ఇరుజట్ల మధ్య జరిగిన నాలుగు టెస్టుల్లోనూ భారత జట్టే పైచేయి సాధించింది. ఈ నేపథ్యంలో లార్డ్స్‌లోనూ విజయంతో చరిత్ర సృష్టించాలని హర్మన్‌ప్రీత్ సేన లక్ష్యంగా పెట్టుకుంది.











## 10 మ్యాచుల్లో విఫలమైనా సరే.. వైభవ్‌కు మరిన్ని అవకాశాలివ్వాలి

**మొహమ్మద్ కైఫ్!**

**బలగం టీవి, హైదరాబాద్**

ఇంగ్లండ్ పర్యటనలో అంతర్జాతీయ టీ20ల్లోకి అరంగేట్రం చేసిన భారత 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపై మాజీ క్రికెటర్ మొహమ్మద్ కైఫ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తొలి రెండు ఇన్నింగ్స్‌ల్లో వైభవ్ (14, 13 పరుగులు) ఆశించిన స్థాయిలో భారీ స్కోర్లు చేయలేకపోయినప్పటికీ, అతడికి జట్టు యాజమాన్యం సుదీర్ఘమైన అవకాశం (రాశీఅస్త్రవతీ తీశీజూవ) ఇవ్వాలని కైఫ్ అభిప్రాయపడ్డారు. ఇంగ్లండ్ వంటి కఠినమైన పరిస్థితుల్లో, జోఫ్రా ఆర్చర్ వంటి వరల్డ్ క్లాస్ బౌలర్లను ఎదుర్కొని ఆడటం ఏ యువ ఆటగాడికైనా అంత సులువు కాదని ఆయన పేర్కొన్నారు.

**నేనే కెప్టెన్ లేదా కోచ్ అయితే 10 మ్యాచులు ఇస్తా!**

మొహమ్మద్ కైఫ్ తన యూట్యూబ్ ఛానల్‌లో మాట్లాడుతూ.. "వైభవ్ సూర్యవంశీలో ఉన్న ప్రతిభను చూశాక, ఒకవేళ నేనే జట్టుకు కెప్టెన్ లేదా కోచ్‌గా ఉంటే.. అతడు వరుసగా 10 మ్యాచుల్లో విఫలమైనా సరే తుది జట్టులో కొనసాగిస్తాను. సాధారణంగా భారత క్రికెట్‌లో అంత ఓపిక (ఫ్రాఅవఅఎవ) ఉండదు, ఆటగాళ్లను త్వరగా జడ్జ్ చేస్తారు. కానీ వైభవ్ అసాధారణమైన ప్లేయర్. ఐర్లాండ్ సిరీస్‌లో అవకాశం రాలేదు, నేరుగా ఇంగ్లండ్‌లోనే అరంగేట్రం చేశాడు. పరిస్థితులకు అలవాటు పడటానికి, మ్యాచ్ సిట్యుయేషన్స్ అర్థం చేసుకోవడానికి అతడికి కొంచెం సమయం పడుతుంది. జట్టు యాజమాన్యం తొందరపడకూడదు. ఒక్కసారి అతడు ఫామ్‌లోకి వస్తే 20 బంతుల్లోనే 60 పరుగులు, 25 బంతుల్లో 80 పరుగులు చేయగల విధ్వంసకారుడు" అని ప్రశంసించారు.

బిహార్‌కు చెందిన ఈ 15 ఏళ్ల లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్.. గత శనివారం (జూలై 4) మాంచెస్టర్ టీ20 ద్వారా అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టి, సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న 'అత్యంత చిన్న వయసులోనే భారత్ తరఫున అరంగేట్రం చేసిన ఆటగాడు' (15 ఏళ్ల 99 రోజులు) అనే చారిత్రాత్మక రికార్డును బద్దలు కొట్టాడు. అండర్-19 వరల్డ్‌కప్: భారత జట్టుకు 6వ సారి ప్రపంచకప్ అందించడంలో కీలక పాత్ర పోషించి, 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్'గా నిలిచాడు. ఐపీఎల్ 2026 విధ్వంసం: రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడుతూ ఏకంగా 776 పరుగులు చేసి 'ఆరెంజ్ క్యాప్'తో పాటు 'మోస్ట్ వాల్యూబుల్ ప్లేయర్' అవార్డు సొంతం చేసుకున్నాడు. ఈ సీజన్‌లో 237.30 స్ట్రైక్ రేట్‌తో రికార్డు స్థాయిలో 72 సిక్సర్లు బాదాడు. ఇండియా-ఎ తరఫున మెరుపులు: శ్రీలంక-ఎ తో జరిగిన ట్రై-నేషన్ సిరీస్ ఫైనల్లో కేవలం 11 బంతుల్లోనే హాఫ్ సెంచరీ బాది, మొత్తంగా 29 బంతుల్లో 94 పరుగులతో ఇండియా-ఎ విజేతగా నిలవడంలో ముఖ్య భూమిక పోషించాడు. వరల్డ్‌కప్ విన్నింగ్ ఓపెనర్ సంజు శాంసన్ వరుసగా విఫలం కావడంతోనే వైభవ్‌కు తుది జట్టులో అవకాశం దక్కింది. ఈ నేపథ్యంలోనే, ఈ అద్భుతమైన కుర్రాడిని ప్రోత్సహిస్తే భవిష్యత్తులో టీమిండియాకు పెద్ద అసెట్ అవుతాడని కైఫ్ ఆశాభావం వ్యక్తం చేశారు.




## లండన్‌లో సూర్యవంశీ ఫ్యామిలీ సందడి..

**వైభవ్‌కు మానసిక ధైర్యం అందించేందుకు యూకే చేరిన బ్రదర్స్..**
**సోషల్ మీడియాలో 'లండన్ డైరీస్' వైరల్**

**బలగం టీవి, హైదరాబాద్**

క్రీడా విభాగం: అంతర్జాతీయ క్రికెట్‌లో రికార్డుల వేట మొదలుపెట్టిన టీమిండియా సరికొత్త సంచలనం వైభవ్ సూర్యవంశీకి ఇంగ్లాండ్ గడ్డపై కుటుంబ సభ్యుల రూపంలో కొండంత అండ లభించింది. కేవలం 15 ఏళ్ల ప్రాయంలోనే అంతర్జాతీయ టీ20ల్లోకి అరంగేట్రం చేసి చారిత్రాత్మక రికార్డు సృష్టించిన ఈ యువకెరటానికి మానసిక ధైర్యాన్ని, మద్దతును అందించేందుకు తాజాగా అతని సోదరులు కూడా లండన్ చేరుకున్నారు.

**బీసీసీఐ ప్రత్యేక ఏర్పాట్లు.. ఒకే చోట చేరిన కుటుంబం**

వైభవ్ ఇంకా చిన్న వయస్కుడు (మైనర్) కావడంతో, ఇంత పెద్ద అంతర్జాతీయ టూర్‌లో అతనికి మైదానంలో కానీ, వెలుపల కానీ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (దీజజక్కీ) ప్రత్యేక వెసులుబాటు కల్పించింది. ఇందులో భాగంగానే వైభవ్ తల్లిదండ్రులు సంజీవ్ సూర్యవంశీ, ఆర్తి దేవిలను ముందే వైభవ్‌తో పాటు ఇంగ్లాండ్ పంపించారు. కాగా, ఇప్పుడు తాజాగా వైభవ్ అన్నయ్యలైన ఉజ్వల్ సూర్యవంశీ, ఆశీర్వాద్ సూర్యవంశీ కూడా లండన్ చేరుకోవడంతో సూర్యవంశీ కుటుంబం అంతా యూకేలో ఒకే చోట చేరినట్లయింది.

**ఇన్‌స్టాగ్రామ్‌లో 'లండన్ డైరీస్' వైరల్!**

వైభవ్ అన్నయ్య ఉజ్వల్ సూర్యవంశీ తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పంచుకున్న ఒక ప్రత్యేక వీడియో ఇప్పుడు నెట్టింట హల్‌చల్ చేస్తోంది. క్రీడాభిమానులను అమితంగా ఆకట్టుకుంటున్న ఈ వీడియోలో.. కుటుంబ సభ్యులందరూ కలిసి లండన్ వీధుల్లో ఎంతో ఆనందంగా గడుపుతూ కనిపించారు. ముఖ్యంగా వైభవ్ చిన్న తమ్ముడు ఎంతో ముద్దుగా తన అన్నయ్యకు శుభాకాంక్షలు చెప్పి, ఆశీర్వదించిన విధానం అభిమానుల హృదయాలను గెలుచుకుంటోంది.

**తోడుగా 'రాజస్థాన్ రాయల్స్' ప్రతినిధి..**

ఈ ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనల్లో వైభవ్‌తో పాటు అతని తల్లిదండ్రులకు అన్ని విషయాల్లోనూ గైడ్‌గా (మార్గదర్శిగా) ఉండేందుకు రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీ ప్రతినిధి రోమీ భిందర్ కూడా లండన్‌లోనే ఉంటూ ప్రత్యేక బాధ్యతలు చూసుకుంటున్నారు. ఐపీఎల్ 2026 లో రాజస్థాన్ తరఫున ఆరెంజ్ క్యాప్ కొట్టి దేశాన్ని ఆకర్షించిన ఈ బిహార్ కుర్రాడికి, కుటుంబం మొత్తం పక్కనే ఉండటం రాబోయే మ్యాచ్‌ల్లో మరింత స్వేచ్ఛగా, ఒత్తిడి లేకుండా రాణించేందుకు ఎంతో దోహదపడుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.



## వింబుల్డన్ ఫైనల్లో ముచోవా..

**సంచలన ఆటతో కొకో గాఫ్‌కు షాక్!**
**ఉత్కంఠభరిత సెమీస్‌లో చెక్ రిపబ్లిక్ స్టార్ విజయం..**
**అమెరికా టెన్నిస్ సెన్సేషన్ కలలు ఛిన్నాభిన్నం**

**బలగం టీవి, హైదరాబాద్**

టెన్నిస్ ప్రపంచంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన వింబుల్డన్ (ఔఱఎశ్రీవసశీఅ) గ్రాండ్‌స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్‌లో ఒక సంచలన విజయం నమోదైంది. గురువారం జరిగిన హోరాహోరీ సెమీఫైనల్ పోరులో చెక్ రిపబ్లిక్ క్రీడాకారిణి కరోలినా ముచోవా అద్భుత ప్రదర్శనతో ఫైనల్‌కు దూసుకెళ్లింది. టోర్నీలో హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన అమెరికా స్టార్, ఏడో సీడ్ కొకో గాఫ్‌ను చిత్తు చేసి, ముచోవా తన కెరీర్‌లో తొలిసారి వింబుల్డన్ టైటిల్ పోరుకు అర్హత సాధించింది. దీంతో ఆల్ ఇంగ్లండ్ క్లబ్ టోర్నీలో మొదటిసారి విజేతగా నిలవాలన్న కొకో గాఫ్ కల చెదిరిపోయింది.

ఆద్యంతం ఉత్కంఠ రేపిన ఈ మ్యాచ్‌లో ఇద్దరు క్రీడాకారిణులూ పట్టువదలకుండా పోరాడారు. తొలి సెట్‌లో ముచోవా పక్కా ప్లానింగ్‌తో బేస్‌లైన్ షాట్లతో విరుచుకుపడి 6-2తో గాఫ్‌కు షాకిచ్చింది. అయితే, రెండో సెట్‌లో లయ అందుకున్న అమెరికా టెన్నిస్ స్టార్ కొకో గాఫ్ అద్భుతంగా పుంజుకుని 6-1తో సెట్‌ను కైవసం చేసుకుని మ్యాచ్‌ను సమం చేసింది.

విజేత ఎవరో తేల్చే అత్యంత కీలకమైన మూడో సెట్‌లో మ్యాచ్ రసకందాయంలో పడింది. ఒకదశలో ఇద్దరూ పాయింట్ల కోసం హోరాహోరీగా తలపడటంతో స్కోరు 10-10తో సమంగా నిలిచింది. ఈ ఒత్తిడితో కూడిన ఉత్కంఠ సమయాల్లో ముచోవా తన అనుభవాన్ని అంతా ఉపయోగించి అసాధారణమైన షాట్లతో చెలరేగిపోయింది. చివరికి టై బ్రేక్‌కు దారితీసిన ఈ సుదీర్ఘ సెట్‌ను 7-6తో గెలుచుకున్న ముచోవా.. ఏడో సీడ్ కొకో గాఫ్‌ను టోర్నీ నుంచి ఇంటికి పంపింది.

**మరో సెమీస్ విజేతతో 'టైటిల్' ఫైట్!**

తొలిసారి వింబుల్డన్ ఫైనల్ చేరిన కరోలినా ముచోవా.. శనివారం జరగబోయే గ్రాండ్ ఫైనల్‌లో టైటిల్ కోసం తలపడనుంది. రెండో సెమీఫైనల్‌లో తలపడుతున్న మార్టా కొత్యుక్ (మీఠతీఠ ఖశీర్ఎబని), లిండా నొస్కోవా (రాఱఅఁఠ చీశీంఎశీఖఠ) లలో విజేతగా నిలిచిన క్రీడాకారిణితో ముచోవా చారిత్రాత్మక వింబుల్డన్ ట్రోఫీ కోసం ఫైనల్ మ్యాచ్ ఆడనుంది. మరి ఫైనల్లోనూ ముచోవా ఇదే జోరును కొనసాగించి కెరీర్‌లో తొలి వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్‌ను ముద్దాడుతుందో లేదో చూడాలి.

# విజయ్ బాక్సాఫీస్ ఆఖరి వేటపై అఫీషియల్ క్లారిటీ

దక్షిణ భారత చలనచిత్ర రంగాన్ని తన మేనరిజంతో, ఊరమాస్ క్రేజ్‌తో మూడు దశాబ్దాల పాటు శాసించిన వన్ అండ్ ఓన్లీ 'దళపతి' విజయ్ బాక్సాఫీస్ ఆఖరి వేటపై అఫీషియల్ క్లారిటీ వచ్చేసింది. ఇటీవల జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో 'తమిళగ వెట్రి కజగం' పార్టీ ద్వారా ప్రభంజనం సృష్టించి, ఏకంగా ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిన విజయ్.. నటుడిగా నటించిన చివరి మైలురాయి చిత్రం 'జననాయకుడు' ఎట్టకేలకు ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. గత కొంతకాలంగా కోర్టు కేసులు, తీవ్రమైన సెన్సార్ వివాదాలు, సాంకేతిక కారణాల వల్ల వాయిదా పడుతూ వచ్చిన ఈ మోస్ట్ ఎవైటెడ్ మూవీ, ఎట్టకేలకు అన్ని అడ్డంకులను అధిగమించి ఈ ఏడాది జూలై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో రచ్చ లేపేందుకు ముహూర్తం ఖరారు చేసుకుంది. దాంతో యావత్ సినీ ప్రపంచంతో పాటు కోట్లాది మంది దళపతి అభిమానుల్లో పూనకాలు మొదలయ్యాయి. ద్ర చలనచిత్ర ధృవీకరణ సంస్థ నుంచి 'జననాయకుడు' చిత్రానికి ఎట్టకేలకు క్లియరెన్స్ లభించింది. చిత్రంలోని హై-వోల్టేజ్ యాక్షన్ ఎపిసోడ్స్, పవర్‌ఫుల్ పొలిటికల్ డైలాగ్స్ కారణంగా సెన్సార్ బోర్డు ఈ సినిమాకు 'యూ' సర్టిఫికేట్‌ను కేటాయించింది. బోర్డు అధికారిక నివేదిక ప్రకారం.. ఈ సినిమా రన్‌టైమ్ ఏకంగా 183 నిమిషాలు (3 గంటల 3 నిమిషాలు) ఉండబోతోంది. వాస్తవానికి క్రితం ఏడాది డిసెంబర్‌లోనే ఈ సినిమాను సెన్సార్‌కు పంపినప్పటికీ, కమిటీ సభ్యుల అభ్యంతరాల వల్ల రివిజన్ కమిటీకి వెళ్లాల్సి వచ్చింది. దీనివల్ల ఈ చిత్రం సంక్రాంతి రేస్ నుంచి






తప్పుకోగా, ఇప్పుడు లీగల్ అడ్డంకులన్నీ ముగిసి జూలై 24 విడుదలకు మార్గం సుగమమైంది. దీనిపై నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ నుంచి త్వరలోనే అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రానుంది. సిల్వర్ స్క్రీన్ పై రికార్డులను తిరగరాయడం విజయ్‌కు వెన్నతో పెట్టిన విద్య. అయితే ఈసారి ఆయన కేవలం ఒక నటుడిగా మాత్రమే కాకుండా.. ఏకంగా తమిళనాడు ముఖ్యమంత్రి హోదాలో థియేటర్లలోకి అడుగుపెడుతుండటం భారతీయ సినీ చరిత్రలోనే ఒక అరుదైన రికార్డు. విజయ్ రాజకీయ వీడ్కోలు పర్యవసానాలకు ముందే శరవేగంగా షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం, ఆయన సినీ కెరీర్‌కు ఒక పవర్‌ఫుల్ గుడ్-బై కానుకగా నిలవనుంది. ప్రతిభావంతుడైన మాస్ డైరెక్టర్ హెచ్. వినోద్ తెరకెక్కిస్తున్న ఈ ప్రతిష్టాత్మక యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుమారు రూ. 500 కోట్ల అపారమైన బడ్జెట్‌తో విజువల్ వండర్‌గా నిర్మించారు. ఈ హై-వోల్టేజ్ పొలిటికల్ యాక్షన్ డ్రామాలో దళపతి సరసన గ్లామరస్ డాల్ పూజా హెగ్డే కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్ స్టార్ బాబీ డియోల్ విలన్‌గా, మమితా బైజు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. వీరికి తోడు రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ అందించిన మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ (దీ+వీ) థియేటర్లలో ఫ్యాన్స్‌కు గూస్‌బంప్స్ తెప్పించడం గ్యారెంటీ అని ఇండస్ట్రీ వర్గాలు అంటున్నాయి. సాధారణంగానే దళపతి విజయ్ చిత్రాలకు వరల్డ్ వైడ్ రికార్డు స్థాయి కలెక్షన్స్ వస్తాయి. అలాంటిది సీఎం హోదాలో వస్తున్న ఆయన ఆఖరి సినిమా కావడంతో, బాక్సాఫీస్ వద్ద పాత రికార్డులన్నీ బద్దలై సరికొత్త చరిత్ర సృష్టించబడటం ఖాయం. జూలై 24న రాబోతున్న 'జననాయకుడు' కేవలం ఒక సినిమా విడుదల లాగా కాకుండా, యావత్ దక్షిణ భారతదేశంలో ఒక చారిత్రాత్మక పండగ వాతావరణాన్ని తీసుకురాబోతోంది.

# ఇండియాలో చాలా మంది నన్ను చంపాలనుకున్నారు

**- స్టార్ బ్యూటీ అదా శర్మ.**

అదా శర్మ.. తెలుగు ప్రేక్షకులకు కొత్తగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. 2008లో దర్శకుడు విక్రమ్ భట్ తెరకెక్కించిన హారర్ చిత్రం '1920'తో హీరోయిన్‌గా తెరంగేట్రం చేసింది. ఆ సినిమాలో ఆమె నటనతో ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత తెలుగులో పూరి జగన్నాథ్ – నితిన్ కాంబినేషన్‌లో వచ్చిన 'హార్ట్ ఎటాక్' మూవీతో టాలీవుడ్ కి గ్రాండ్ ఎంట్రీ ఇచ్చింది. ఆ చిత్రంలో తన నటనతో మంచి మార్కులు కొట్టేసింది. ఆ తర్వాత ఆమె 'సన్నాఫ్ సత్యమూర్తి', 'క్షణం' వంటి చిత్రాల్లో నటించి తెలుగు ప్రేక్షకుల మన్నన పొందింది. కాగా 'కల్కి'లో రాజశేఖర్ సరసన నటించి మెప్పించింది. కానీ ఆ తర్వాత ఆశించిన స్థాయిలో అవకాశాలు దక్కకపోవడంతో సెకండ్ హీరోయిన్ గా పలు చిత్రాల్లో నటించింది. తెలుగు చిత్రాల తర్వాత అదా శర్మ బాలీవుడ్‌లోకి మళ్లీ దృష్టి సారించింది. తన అందం, గ్లామర్‌తో పాటు పాత్రల ఎంపికతో అదా శర్మ ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకుంది. అయితే అదా కెరీర్ కి టర్నింగ్ పాయింట్ అంటే కేరళ స్టోరీ అనే చెప్పాలి. అయితే 2023లో విడుదలైన 'ది కేరళ స్టోరీ' చిత్రం అదా శర్మ జీవితాన్ని పూర్తిగా మార్చేసింది. ఈ లేడీ ఓరియెంటెడ్ చిత్రం దేశవ్యాప్తంగా భారీ చర్చకు దారితీసింది. తీవ్ర రాజకీయ వివాదాల మధ్య వచ్చిన ఈ చిత్రం రూ. 400 కోట్లకుపైగా వసూళ్లు సాధించింది. ఈ సినిమా విజయంతో అదా శర్మ ఒక్కసారిగా దేశవ్యాప్తంగా పాపులర్ అయ్యింది. అనేక జాతీయ స్థాయి మీడియా ఇంటర్వ్యూలు, టాక్ షోలు ఆమెను



స్పాట్‌లైట్‌లోకి తెచ్చాయి. ఈ క్రమంలోనే గతంలో అదా శర్మ ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ది కేరళ స్టోరీ విడుదలైనప్పుడు సగం దేశం నన్ను చంపాలని ప్రయత్నించింది. కానీ మిగతా సగం దేశం నన్ను ప్రేమించింది, రక్షించింది" అని వెల్లడించారు. సవాలు ఉన్న పాత్రలే కెరీర్‌కు విలువ ఇస్తాయి. 1920 నుంచే నేను రిస్క్ ఉన్న రోల్స్ ఎంచుకున్నాను. ఆ రిస్క్ వల్లే నాకు ఇవాళ గుర్తింపు వచ్చింది. పాత్రలో భావోద్వేగం లేకపోతే నాకు నచ్చదు. యాక్షన్ సీన్లు ఉండాలి," అని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం అదా శర్మ బాలీవుడ్‌లో పలు లేడీ ఓరియెంటెడ్ ప్రాజెక్ట్స్‌లో నటిస్తోంది. మరోవైపు సోషల్ మీడియాలో కూడా యాక్టివ్ గా ఉంటూ ఆమె ఇన్‌స్టాగ్రామ్ పోస్టులు, ఫిట్‌నెస్ వీడియోలు, డాన్స్ క్లిప్స్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. గ్లామరస్ ఫోటోషూట్లతో ఆమె తరచూ ట్రెండింగ్‌లో నిలుస్తుంది.

# ప్రీతి జింటాకు బాంబే హైకోర్టులో బిగ్ రిలీఫ్!



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ప్రీతి జింటాకు బాంబే హైకోర్టులో బిగ్ రిలీఫ్ లభించింది. ఇంటర్నెట్‌లో ఏఐ టెక్నాలజీని ఉపయోగించి సృష్టించిన డీప్‌ఫేక్స్, మార్ఫింగ్ ఫోటోలు, ఫేక్ వీడియోలు, ఆమె గుర్తింపును దుర్వినియోగం చేస్తూ అప్‌లోడ్ చేసిన అనధికారిక కంటెంట్‌కు వ్యతిరేకంగా న్యాయస్థానం ఆమెకు తాత్కాలిక రక్షణను మంజూరు చేసింది. ప్రాథమిక ఆధారాలను పరిశీలించిన అనంతరం కోర్టు ప్రీతి జింటాకు అనుకూలంగా ఈ ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసు విచారణ సందర్భంగా బాంబే హైకోర్టు సంచలన కామెంట్లు చేసింది. ఏఐని దుర్వినియోగం చేస్తూ ఫేక్ కంటెంట్‌ను సృష్టించడం ఓ వ్యక్తి పర్సనాలిటీ రైట్స్, పబ్లిసిటీ రైట్స్, గౌరవంగా జీవించే ప్రాథమిక హక్కుకు భంగం కలిగించినట్లేనని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఓ సెలబ్రిటీ ముఖాన్ని, రూపాన్ని వారి అనుమతి లేకుండా వాడటం వల్ల వారి ప్రతిష్ట దెబ్బతినడమే కాకుండా.. ప్రజల్లో వారిపై ఉన్న నమ్మకం కూడా సన్నగిల్లుతుందని న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేసింది. ఇదే సమయంలో సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల బాధ్యతపై న్యాయస్థానం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఇంటర్నెట్ మధ్యవర్తులు తమ ప్లాట్‌ఫారమ్‌లు దుర్విని యోగం కాకుండా చురుగ్గా వ్యవహరించాలని.. ఐటీ నిబంధనల ప్రకారం తమ బాధ్యతలను ఖచ్చితంగా నెరవేర్చాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఇలాంటి అభ్యంతరకర ఫేక్ కంటెంట్‌పై తక్షణమే చర్యలు తీసుకోవడం వల్ల పౌరుల హక్కులను రక్షించవచ్చని.. అలాగే పదే పదే తప్పులు చేసే నేరగాళ్లను అడ్డుకోవచ్చని న్యాయస్థానం పేర్కొంది. విచారణ సమయంలో ప్రీతి జింటా తరఫు న్యాయవాదులు న్యాయస్థానానికి కీలక సమాచారాన్ని అందించారు. ఇంటర్నెట్‌లో వందలాది లింకులలో ప్రీతి జింటాకు సంబంధించిన ఏఐ-జనరేటెడ్ లేదా మార్ఫింగ్ చేసిన ఫోటోలు, వీడియోలు ఉన్నాయని.. అవి ఆమె గుర్తింపును తప్పుగా చిత్రీకరిస్తున్నాయని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. ఈ వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం.. సదరు నకిలీ కంటెంట్ ను వెంటనే తొలగించాలని సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లను ఆదేశించింది.

# వ్యాపారవేత్త కుమార్తెతో ప్రభాస్ ఏడడుగులు?

పాన్ ఇండియా స్టార్, యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ పెళ్లి వార్తలకు ఉండే క్రేజ్ ఎలాంటిదో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఆయన సినిమా అప్‌డేట్స్ ఎంత వేగంగా వైరల్ అవుతాయో, ఆయన వ్యక్తిగత జీవితం పై వచ్చే పుకార్లు కూడా అంతే రేంజ్‌లో హల్‌చల్ చేస్తుంటాయి. తాజాగా ఫిలిం నగర్ వర్గాల్లో ప్రభాస్ పెళ్లి, ఆయన నిర్మిస్తున్న కొత్త ఇంటికి సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాను ఊపేస్తోంది. హైదరాబాద్‌లోనే అత్యంత ఖరీదైన ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ (కోకాపేట) పరిసరాల్లో ప్రభాస్ సుమారు 200 కోట్ల రూపాయల భారీ బడ్జెట్‌తో ఒక విలాసవంతమైన భవనాన్ని నిర్మిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో, అంతర్జాతీయ ప్రమాణాలు, అత్యాధునిక సౌకర్యాలతో ఈ డ్రీమ్ హౌస్ నిర్మాణం జరుగుతోందట. ఈ భారీ రాజభవనానికి సంబంధించి నెట్టింట రకరకాల ప్రచారాలు మొదలయ్యాయి. కాబోయే భార్యకే సర్ ప్రైజ్ గిఫ్ట్ గా దీన్ని ఇద్దామని అనుకుంటున్నారంటున్నారు. వచ్చే ఏడాది ప్రభాస్ ఒక ప్రముఖ వ్యాపారవేత్త కుమార్తెను వివాహం చేసుకోబోతున్నారని, ఈ పెళ్లి పనులను ఆయన పెద్దమ్మ శ్యామలా దేవి దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారనే ప్రచారం జోరందుకుంది. పెళ్లి సమయానికి ఈ డ్రీమ్ హౌస్ నిర్మాణం పూర్తికానుందని, పెళ్లయ్యాక భార్యతో కలిసి ఆ భవనంలోకి గృహప్రవేశం చేసేలా ప్లాన్ చేస్తున్నారని.. అందుకే కాబోయే భార్యకు కానుకగా ప్రభాస్ ఈ ఇల్లు నిర్మిస్తున్నారంటూ సోషల్ మీడియాలో



కథనాలు వస్తున్నాయి. కోకాపేట పరిసరాల్లో ప్రభాస్ ఒక లగ్జరీ ఇల్లు నిర్మిస్తున్న మాట నిజమే అయినప్పటికీ.. దానిని పెళ్లితో ముడిపెడుతూ వస్తున్న వార్తల్లో ఎలాంటి అధికారిక నిజం లేదంటున్నారు. ప్రభాస్ టీమ్ కానీ, ఆయన కుటుంబ సభ్యులు కానీ ఈ వార్తలను ధ్రువీకరించలేదు. గతంలో అనుష్క శెట్టి, కృతి సనన్ వంటి కథానాయికలతో ప్రభాస్ పెళ్లి అంటూ వచ్చిన పుకార్ల తరహాలోనే.. ఇప్పుడు కూడా కొత్త ఇంటి పేరు చెప్పి ఈ ప్రచారానికి తెరలేపారు. ప్రస్తుతం 46 ఏళ్ల ప్రభాస్ తన పూర్తి దృష్టిని సినిమాలపైనే నిలిపారు. ఆయన డైరీ రాబోయే మూడేళ్ల వరకు భారీ ప్రాజెక్టులతో నిండిపోయింది. ఈ స్థాయి బిజీ షెడ్యూల్ మధ్య వచ్చే ఏడాదే ప్రభాస్ పెళ్లి పీటలు ఎక్కుతారనే వార్తల్లో నిజం ఉందా? లేదా? అనేది డార్లింగ్ కే తెలియాలంటున్నారు.

# అఖిల్ "లెనిన్" ఫస్ట్ రివ్యూ.. ఇంటర్వెల్ నుంచి క్లైమాక్స్ వరకు ఊచకోతే !!

అక్కినేని యువ హీరో అఖిల్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ చిత్రం "లెనిన్". వినరో భాగ్యము విష్ణు కథ ఫేమ్ మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో.. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తుంది. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో మనం ఎంటర్‌ప్రైజెస్ ఎల్‌ఎల్‌పి, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్స్ పై.. అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. మయూకీక డైరెక్టర్ తమన్ సంగీతం సమకూర్చారు. ఇప్పటికే విడుదలైన టీజర్, సాంగ్స్, ట్రైలర్ లకు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను దక్కించుకుని సినిమాపై భారీ హైప్‌ను క్రియేట్ చేశాయి. జూలై 10వ తేదీన ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ యంగ్ హీరో సిసింద్రీ సినిమాతో చైల్డ్ ఆర్టిస్ట్ గా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి.. "అఖిల్" సినిమాతో హీరోగా ఎంట్రీ ఇచ్చారు. ఆ తర్వాత హలో, మిస్టర్ మజ్ను సినిమాలతో ఆశించిన స్థాయిలో సక్సెస్ అందుకోలేకపోయారు. కానీ మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ మూవీతో మంచి హిట్ అందుకున్నారు. ఆ తర్వాత భారీ అంచనాలతో వచ్చిన ఏజెంట్ సినిమా డిజాస్టర్ కావడంతో దాదాపు మూడేళ్ల గ్యాప్ తీసుకొని ఇప్పుడు ఈ మూవీతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. అయితే మరికొన్ని గంటల్లో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో మూవీ సెన్సార్ రిపోర్ట్ బయటకు వచ్చింది. ఈ చిత్రానికి'ఖ/యూ' సర్టిఫికెట్ ఇవ్వగా.. సెన్సార్ నుంచి పాజిటివ్ టాక్ వినిపిస్తోంది. క్రిస్పీ రన్ టైంతో, స్క్రీన్ ప్లే ఎక్కడా పక్కదారి పట్టకుండా సినిమా సాగుతుందని సెన్సార్ వర్గాలు పేర్కొంటున్నాయి. ముఖ్యంగా సెకండాఫ్ బలమైన భావోద్వేగాలతో ఉంటుందని చెబుతున్నారు. ఇంటర్వెల్ నుంచి క్లైమాక్స్ వరకు అఖిల్ విశ్వ రూపం చూపించారని, ట్విస్టులు అదిరిపోయాయని అంటున్నారు. ప్రధాన జంట, ఎమోషనల్ అండ్ యాక్షన్ సీన్స్, బ్యాగ్రౌండ్ స్కోర్ ఈ చిత్రానికి ప్రధాన బలాలు అని సెన్సార్ టాక్ ని బట్టి తెలుస్తోంది. ఈసారి తనయుడి కోసం కింగ్ నాగార్జున స్వయంగా రంగంలోకి దిగి ప్రచారం చేస్తున్నారు. దాంతో అక్కినేని ఫ్యామిలీతో పాటుగా అభిమానులు కూడా ఈ సినిమా సక్సెస్ అవ్వాలని బలంగా కోరుకుంటున్నారు. ఈసారి అయ్యగారు బ్లాక్ బస్టర్ హిట్టు కొడతారని అందరూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. అఖిల్ కెరీర్‌కు 'లెనిన్' ఒక గొప్ప మలుపుగా నిలుస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికే ఈ మూవీ జూలై 10న తెల్లవారుజాము ఆటలతో థియేటర్లలోకి రాబోతుండగా.. ఎర్లీ మార్నింగ్ షోల వివరాలను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఓవర్సీస్ అంతటా భారత కాలమానం ప్రకారం రేపు ఉదయం 4:30 గంటలకు షోలు ప్రారంభం కానున్నాయి.

# సమంత సంచలన నిర్ణయం..



## ఆ షో కోసం కళ్లుచెదిరే పారితోషకం !!

స్టార్ హీరోయిన్ సమంత.. 'ఏ మాయ చేసావే' సినిమాతో ఇండస్ట్రీకి పరిచయమైంది. నాగ చైతన్య సరసన 'ఏ మాయ చేసావే' సినిమాతో సమంత ఇండస్ట్రీకి పరిచయమైంది. ఆ తర్వాత మహేష్ బాబు, ఎన్టీఆర్, రామ్ చరణ్, అల్లు అర్జున్ వంటి హీరోల సరసన నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. ఇక తెలుగులో చివరిగా విజయ్ దేవరకొండ సరసన ఖుషి సినిమాలో నటించింది. ఆ తర్వాత సిటాడెల్: హనీ బన్నీ అనే యాక్షన్ వెబ్ సిరీస్‌లో నటించింది. ఈ రెండు ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను అలరించలేకపోయాయి. కాగా రీసెంట్ గానే "మా ఇంటి బంగారం" సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి హిట్ అందుకుంది. ఈ చిత్రానికి నందిని రెడ్డి దర్శకత్వం వహించగా రాజ్ నిడమోరు స్క్రీన్ ప్లే సమకూర్చారు. ఈ మూవీ సక్సెస్ మీట్ లోనే తాను ప్రెగ్నెంట్ ని అంటూ గుడ్ న్యూస్ ప్రకటించింది ఈ భామ. దాంతో కొంతకాలం బ్రేక్ తప్పదని స్పష్టం చేసింది. అయితే సినిమాల నుంచి కొంత విరామం తీసుకుంటున్న సామ్.. ఓ ఓటీటీ వేదికలో కొత్త షో కి ఓకే చెప్పినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. సమంత మరోసారి డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్ కోసం రెడీ అయినట్టు సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. సోనీ లివ్ తమిళ్‌తో సమంత అగ్రిమెంట్ చేసుకున్నారని.. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పూర్తి వివరాలు త్వరలోనే అధికారికంగా వెల్లడికానున్నట్టు టాక్ వినిపిస్తుంది. అయితే ప్రస్తుతం చెన్నైలో ఈ షో కి సంబంధించి ప్రీ-ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయని.. షో ఫార్మాట్ చిట్‌చాట్‌లా కాకుండా సెలబ్రిటీల వ్యక్తిగత అనుభవాలు, సంబంధాలు, కెరీర్ గురించి ఉండొచ్చని భావిస్తున్నారు. ఇక సమంతకు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు కొత్తవి కాదనే చెప్పాలి. గతంలో ఆహా కోసం చేసిన 'సామ్ జామ్' షోలో హోస్ట్‌గా కనిపించారు. అంతే కాకుండా ఈ షో కోసం సమంత భారీ పారితోషికం అందుకోనున్నారనే వార్తలు కూడా వినిపిస్తున్నాయి. ఒక్కో ఎపిసోడ్‌కు కోటి రూపాయల వరకు చెల్లించనున్నారన్న ప్రచారం నడుస్తోంది. దీనిపై సమంత టీమ్ లేదా సోనీ లివ్ నుంచి స్పష్టమైన ప్రకటన రాలేదు. అధికారిక నిర్ధారణ వచ్చే వరకు ఈ వివరాలను ట్రేడ్ వర్గాల అంచనాలుగానే చూడాలి.

# మహేష్ బాబు మేనకోడలు దెబ్బకి సోషల్ మీడియా షేక్.. పిక్స్ వైరల్ !!



తెలుగు సినీ పరిశ్రమలో ఘట్టమనేని కుటుంబానికి ప్రత్యేక స్థానం ఉంది. దాదాపు ఐదు దశాబ్దాల పాటు తన నటన, ప్రయోగాత్మక చిత్రాలు, సాహసోపేతమైన పాత్రలతో ప్రేక్షకులను అలరించిన సూపర్ స్టార్ కృష్ణ తెలుగు సినిమా చరిత్రలో చెర గని ముద్ర వేశారు. 300కు పైగా చిత్రాల్లో నటించిన ఆయన, కౌబాయ్ సినిమాలు, జేమ్స్ బాండ్ తరహా కథలు, సాంకేతిక ప్రయోగాలతో తెలుగు సినీ రంగానికి కొత్త దారులు చూపించారు. అనంతరం ఆయన వారసత్వాన్ని అందిపుచ్చుకుని సూపర్ స్టార్ మహేష్ బాబు టాలీవుడ్‌లో అగ్రహీరోగా ఎదిగి ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్నారు. కాగా ఘట్టమనేని కుటుంబం నుంచి మూడో తరం వారసురాలు కూడా వెండితెరపైకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. మహేష్ బాబు సోదరి, నటి-నిర్మాత మంజుల ఘట్టమనేని, నటుడు సంజయ్ స్వరూప్ దంపతుల కుమార్తె జాన్వీ స్వరూప్.. త్వరలోనే హీరోయిన్‌గా ఎంట్రీ ఇవ్వనుంది. రీసెంట్ గానే ఈ విషయాన్ని మంజుల అధికారికంగా ప్రకటించారు. జాన్వీ 2018లో విడుదలైన 'మనసుకు నచ్చింది' సినిమాలో చిన్న పాత్రలో కనిపించింది. ఈ చిత్రానికి మంజుల ఘట్టమనేని దర్శకత్వం వహించగా, సందీప్ కిషన్ హీరోగా నటించారు.